aruhi
aruhi group
MAHAA PRABHA NEWS
Delivering truth with integrity – the voice of the people."
Email : info@mahaaprabha.com
www.mahaaprabha.com - 9160600610




నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
బుధవారం
10-06-2026 సంపుటి : 01 సంచిక : 79 పేజీలు : 08 వెల : ₹ 5/-
తెలుగు దినపత్రిక

BESQATI
besqati.com
www.besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA.తెలంగాణ mahaaprabha.com NAMASTEY MAHAAPRABHA RNI NO : TGTEL/26/A0738 info@mahaaprabha.com



## పీఓకేలో రక్తపాతం

**నిరసనకారులపై పాక్ బలగాల కాల్పులు..**

- 30 మంది మృతి.. 200 మందికి పైగా గాయాలు
- ముజఫరాబాద్, రావలకోట్‌లో ఉద్రిక్త పరిస్థితులు
- హక్కుల కోసం పోరాటం.. అణచివేతకు దిగిన పాక్ బలగాలు

3

పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ ( లో తీవ్ర ఉద్రిక్తతలు చెలరేగాయి. రేషన్ కోటా తగ్గింపు, ధరల పెరుగుదలపై ఆందోళనకారులు రోడ్లపైకి దిగి భద్రతా బలగాలపై దాడులు చేయడంతో ఘర్షణలు హింసాత్మకంగా మారాయి. ఈ ఘటనల్లో సుమారు 30 మంది మృతి చెందగా, 200 మందికి పైగా గాయపడినట్లు సమాచారం. పరిస్థితి ర్లటవల్‌కోట్, బింబర్, ముజఫరాబాద్ ప్రాంతాల్లో అత్యంత ఉద్రిక్తంగా మారింది.

### ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు

## పెద్దపీట

**మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ**

ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు పెద్దపీట వేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కీలక పథకాలను అమలు చేస్తూ, 553 ఆర్టీసీ బస్సు సర్వీసులను మహిళలకు ఉచిత ప్రయాణానికి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.
హైదరాబాద్ ప్రజా ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన సీఎం, మహిళా సాధికారతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, విద్య, రవాణా, సంక్షేమ రంగాల్లో భారీ పెట్టుబడులు పెట్టి సమగ్ర అభివృద్ధిని సాధిస్తామని ఆయన వెల్లడించారు.

- మహిళా సాధికారతకు మరో అడుగు
- వారిని కోటీశ్వరులను చేసే పనిలో వెనకడుగు లేదు
- మహిళల స్ఫూర్తితోనే తమ ప్రజాపాలన సాగుతోంది
- వారి దెబ్బకే కొందరు ఫామ్‌హౌజ్‌కు పరిమితం అయ్యారు
- కెసిఆర్ హయాంలో మంత్రి పదవులు కూడా ఇవ్వలేదు
- బిజెపి కనీసం మహిళకు అధ్యక్ష పదవి ఇవ్వలేదు
- పరేడ్ గ్రౌండ్స్ సభలో సిఎం రేవంత్ రెడ్డి

3





### దేశ ద్రోహులకు

## స్థానం లేదు

- భారత్ ధర్మసత్రం కాదు
- లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్

3

## విజయన్ కుమార్తెకు ఈడీ సమన్లు



3



### ప్రాజెక్టులకు అడ్డుపడ్డానని

## నిరూపిస్తావా

- నిరూపిస్తే వెంటనే రాజీనామా చేస్తా
- అప్పులు తెచ్చి సోకులు చేస్తున్నారు
- మంత్రులతోపాటు అందరూ భూ దోపిడీ చేస్తున్నారు
- సిఎం రేవంత్‌కు కిషన్ రెడ్డి సవాల్

**న్యూఢిల్లీ జూన్ 9( మహాప్రభ)**
తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులను తాను అడ్డుకుంటున్నానని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం సాధించినా తెలంగాణ ప్రజల బతుకులు మాత్రం మారలేదంటూ కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తెచ్చి సోకులు చేస్తున్నారంటూ గత బీఆర్ఎస్, ప్రస్తుత రేవంత్ సర్కార్ తీరును ఆయన ఎండగట్టారు. హైదరాబాద్‌లో భూములు మిగిలే పరిస్థితి లేదన్నారు. మంత్రులతోపాటు అందరూ భూ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలయ్యిందని చెప్పారు. ఉద్యోగులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి ప్రభుత్వానికి లేదన్నారు.సీఎం రేవంత్

-మిగతా 3 లో



### ధాన్యం కొనుగోళ్లపై

## కేంద్రం తిరకాసు

- మరోమారు కేంద్రానికి లేఖ రాస్తా
- 8 లక్షల మేట్రిక్ టన్నుల మొక్క జొన్న కొనుగోలు
- హమాలీల కొరత కూడా సేకరణలో అడ్డంకి
- ధాన్యం సేకరణలో ప్రతిపక్షాల విమర్శలు అర్థరహితం
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బాధ్యతారహి విమర్శలు
- మేడిగడ్డలో నీళ్లు నింపితే కొట్టకుపోతాయన్న ఎన్‌డీఎస్‌ఏ
- మీడియా సమావేంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్ జూన్ 9( మహాప్రభ)**
తెలంగాణ రాష్ట్రంలోని వడ్లకు ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ లేదని పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అందుకే ఈ వడ్లను కేంద్రం కొనుగోలు చేయడానికి సుముఖంగా లేదన్నారు. మంగళవారం హైదరాబాద్ సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో ఇష్ఠాగోష్టిగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో పండించిన 75 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేయాలని మరోసారి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి లేఖ రాస్తానని ఆయన స్పష్టం చేశారు. ఇంకా రెండు లక్షల మెట్రిక్ టన్నుల ప్రోక్యూర్‌మెంట్ వచ్చే అవకాశం

-మిగతా 3 లో



## లక్షద్వీప్‌లో మద్యం అమ్మకాలకు గ్రీన్‌సిగ్నల్

- 1979 నాటి పాత చట్టాన్ని రద్దు చేసిన కేంద్రం
- లైసెన్స్ ఉంటేనే ఇకపై మద్యం విక్రయాలు
- విదేశీ లిక్కర్‌పై 400%, బీర్లపై 200 శాతం ఎక్సైజ్ సుంకం!
- మాల్దీవులకు పోటీగా టూరిజం హబ్
- స్థానిక సెంటిమెంట్లు దాటి కేంద్రం కీలక నిర్ణయం

3

**47 ఏండ్ల నిషేధం ఎత్తివేత..**

### నైరుతి ఆగమనంతో

## పలకరించిన తొలకరి

- హైదరాబాద్ నగరంలో ఉరుములతో భారీ వర్షం
- ఎప్పటిలాగే లోతట్టు ప్రాంతాలు జలమయం
- అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక



**హైదరాబాద్,జూన్ 9( మహాప్రభ)**
తొలకరి పలకరించింది. నైరుతి ప్రవేశంతో హైదరాబాద్ నగరంలో భారీ వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నగరంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. నగరంలో పలు చోట్ల ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలుల తీవ్రతకు రామ్‌నగర్‌లోని వీఎస్టీ రోడ్డులో భారీ వృక్షం నేలకొరిగింది. అలాగే, హైదర్‌గూడలోనూ ఓ భారీ వృక్షం నేలకొరగడంతో ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది.

-మిగతా 3 లో

## 18 గంటలు పనిచేస్తున్నాం




**ధనిక రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు:**

- పేదలకు సన్నబియ్యం ఇవ్వాలని బిఆర్ఎస్ ఆలోచించలేదు
- ఇచ్చిన హామీ మేరకు ఇప్పటి వరకు 76వేల ప్రభుత్వ ఉద్యోగాల కల్పన
- తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరలకు కొంటున్న ఘనత మాదే
- జనగామ జిల్లా పర్యటనలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క

**జనగామ, జూన్ 9( మహాప్రభ)**
: ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర మంత్రివర్గం 18 గంటలు పనిచేస్తుంటే.. బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఏదో ఒక అభాండం వేస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ధనిక రాష్ట్రాన్ని చేతిలో పెడితే అంతా ఖాళీ చేసిపోయారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు రాష్ట్రాన్ని దోపిడీ చేశారన్నారు. పేదలకు చెందాల్సిన సొమ్మును బీఆర్ఎస్ దోచుకుందని

-మిగతా 3 లో



### హెచ్1 బి వీసాపై

## ట్రంప్‌కు షాక్

- హెచ్1బీ ఫీజు పెంపు నిర్ణయానికి అమెరికా కోర్టులో బ్రేక్
- ట్రంప్ ప్రతిపాదించిన 85 లక్షల డాలర్ల ఫీజుపై న్యాయస్థానం అడ్డుకట్ట
- ఫెడరల్ కోర్టు తీర్పుతో వలస విధానానికి తాత్కాలిక ఉపశమనం
- 20 రాష్ట్రాల పిటిషన్లతో ట్రంప్ నిర్ణయానికి ఎదురుదెబ్బ

**వాషింగ్టన్ జూన్ 9( మహాప్రభ)**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు షాక్ తగిలింది. హెచ్1బీ వీసాల కోసం ట్రంప్ ప్రభుత్వం ప్రతిపాదించిన లక్ష డాలర్ల సుమారు రూ. 85 లక్షలకు పైగా భారీ ఫీజును అమెరికా ఫెడరల్ న్యాయస్థానం కొట్టేసింది. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం పూర్తిగా చట్ట విరుద్ధమని బోస్టన్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి లియో సొరొకిన్ సోమవారం తీర్పు వెలువరించారు. విదేశాల్లో ఉంటూ అమెరికా తాత్కాలిక వలస వీసా హెచ్1బీకి ఎంపికైన వారు ఈ భారీ మొత్తాన్ని చెల్లించాలని గత సెప్టెంబరులో ట్రంప్ ప్రభుత్వం నిబంధన తీసుకురాగా.. దీనిని సవాలు చేస్తూ అమెరికాలోని 20 రాష్ట్రాల అటార్నీ జనరల్స్ బోస్టన్ కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన జడ్జి, అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు నేరుగా ఇలాంటి పన్నులపై నిర్ణయం తీసుకోలేరని స్పష్టం చేశారు. ఈ భారీ వసూలు పెనాల్టీ కాదని,

-మిగతా 3 లో

# భారత్ అణ్వాయుధాల్ని బయటపెట్టిందా.. కేంద్ర పాలసీ మారిందా..?




**న్యూఢిల్లీ:జూన్ 9( మహాప్రభ)**
ఇండియా దగ్గర అణ్వాయుధాలు ఉన్న సంగతి తెలిసిందే. అయితే, వీటిపై ఇంకా స్పష్టత లేదు. కానీ, ఇటీవలే మన అణు సామర్థ్యానికి సంబంధించి కొన్ని సంచలన విషయాలు వెల్లడయ్యాయి. సిప్రి (స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్) ఇటీవల ఒక నివేదిక విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ సంస్థ వివిధ దేశాల్లో ఉన్న అయుధాలు, అణ్వాయుధాల గురించి వివరాలు వెలికితీస్తుంది. ఈ సంస్థ నివేదిక ద్వారా భారతీయ అణుసామర్థ్యం గురించి ప్రపంచానికి కీలక విషయాలు తెలిశాయి.సాధారణంగా ఏ దేశమైనా తమ అణు సామర్థ్యం గురించి బయటకు చెప్పదు. ఇండియా కూడా కొన్నేళ్లుగా అదే చేస్తూ వస్తోంది. కానీ, ఈసారి మాత్రం ఇండియా కొన్ని విషయాల్ని బయటపెట్టింది. దశాబ్దాలుగా ఉన్న తన విధానాన్ని మార్చుకుంది. ఇండియా తయారు చేసిన 12 అణ్వాయుధాలను బహిరంగపర్చినట్లు సిప్రి నివేదిక తేల్చింది. ఈ నివేదిక ప్రకారం.. ఇండియా అణు వార్ హెడ్లను రహస్యంగా దాచకుండా, ప్రయోగానికి సిద్ధం చేసి ఉంచింది. అంటే అవసరమైతే అణ్వాయుధాలను ప్రయోగించేందుకు సిద్ధం చేసిందని అర్థం. ఈ అణ్వాయుధాలను అండర్‌గ్రౌండ్ సిలోస్ లోపల, సబ్‌మెరైన్స్ లోపల ప్రయోగానికి సిద్ధం చేసి ఉంచారు. అలా, 12 అణ్వాయుధాలను ప్రత్యేక బేస్‌లలో, సైనిక దళాల ఆధ్వర్యంలో ఇండియా సిద్ధం చేసి ఉంచింది. ఈ ఏడాది జనవరి నాటికి ఇండియా వద్ద 190 అణ్వాయుధాలు ఉన్నట్లు సిప్రి అంచనా. వీటిని విమానాల నుంచి, నేలమీద నుంచి, సముద్రాల నుంచి ప్రయోగించడానికి అవకాశం ఉంది. ఆయుధాలు ప్రయోగించే ప్రదేశాలకు అణ్వాయుధాలను దూరంగానే ఉంచుతారు. అయితే, ఇప్పుడు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆయుధాల్ని ముందుగా మోహరించి సిద్ధం చేస్తున్నారు. ఇలా అణ్వాయుధాలను ప్రయోగానికి సిద్ధంగా ఉంచినప్పటికీ తన మూల సూత్రాలను మర్చిపోలేదని సిప్రి నివేదిక తేల్చింది. 'నో ఫస్ట్ యూజ్' అనే పాలసీని ఇండియా అనుసరిస్తోంది. అంటే, అణ్వాయుధాలను ముందుగా మనం ప్రయోగించకూడదు అనేది మన దేశ అణువిధానం. మన దేశం మీద అణు దాడి జరిగినప్పుడే ఇండియా శత్రుదేశాలపై అణ్వాయుధాన్ని ప్రయోగిస్తుంది.

# పెట్రోల్ ధరలు పెరుగుతున్నా నష్టాల్లోనే చమురు కంపెనీలు..

## రోజుకు రూ.700 కోట్ల నష్టం



**న్యూఢిల్లీ:జూన్ 9( మహాప్రభ)**
దేశంలో ఒకపక్క పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలు పెరుగుతున్నాయి. ఈ ధరలు సామాన్యుడిని బెంబేలెత్తిస్తున్నాయి. ప్రజల జేబులకు చిల్లులు పెడుతూ చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ చమురు కంపెనీలు నష్టాల బాటలోనే కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వం రంగ చమురు కంపెనీలు భారీ నష్టాలు పొందుతున్నాయి. ఈ విషయాన్ని ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరుగుతున్నప్పటికీ, దేశంలో కొంతకాలం చమురు ధరలుపెరగలేదు.ఇటీవలి కాలంలో మాత్రం ఈ ధరలు పెరుగుతున్నాయి. ఎల్పీజీపై సగటును ఒక లీటర్‌కు రూ.7.50 ధర పెరిగింది. అయినప్పటికీ కంపెనీలు మాత్రం నష్టాల బాటలోనే నడుస్తున్నాయి. ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు ప్రస్తుతం ప్రతిరోజూ ఒక లీటర్ డీజిల్‌పై రూ.30. పెట్రోల్‌పై రూ.6 వరకు నష్టపోతున్నాయి. ఏప్రిల్ 1 నాటి చమురు ధరల ప్రకారం.. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధర పెరిగినప్పటికీ దేశంలో ఆయిల్ ధరలు పెరగలేదు. అప్పట్లో ఒక లీటర్ పెట్రోల్‌పై రూ.24, డీజిల్‌పై రూ.105 వరకు నష్టం వచ్చిందని కంపెనీలు చెబుతున్నాయి. దీంతో కంపెనీలపై తీవ్ర ఆర్థిక భారం పడింది. ఈ నేపథ్యంలోనే ఇటీవల చమురు ధరల్ని పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. అయినప్పటికీ చమురు కంపెనీలు నష్టాల్లోనే కొనసాగుతున్నాయని కేంద్ర చమురు, సహజవాయువు శాఖ అదనపు కార్యదర్శి ప్రవీణ్ ఖనూజ వెల్లడించారు. ప్రస్తుతం చమురు కంపెనీలు ప్రతి రోజూ సగటున రూ.600 కోట్ల నుంచి రూ.700 కోట్ల వరకు నష్టపోతున్నాయన్నారు. ముఖ్యంగా వంట గ్యాస్ సిలిండర్లపై ఎక్కువ నష్టం వస్తోందన్నారు. 14.2 కేజీల బరువు ఉండే గృహ సిలిండర్‌పై రూ.700 వరకు నష్టం వస్తోంది. కంపెనీలకు తయారీ, నిర్వహణ ఖర్చులకు, వినియోగదారుడు చెల్లించే డబ్బులకు మధ్య భారీ వ్యత్యాసం ఉందని ఖనూజా తెలిపారు. ఇంత నష్టం వస్తున్నప్పటికీ గృహ వినియోగదారులపై భారం పడకూడదని కేంద్రం ప్రయత్నిస్తోందని ఆయన చెప్పారు. నిజానికి ఇప్పుడు గృహ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.1,600 వరకు ఉంటుందని, కానీ, కేంద్రం తక్కువ ధరకే అందిస్తోందని చెప్పారు. ఢిల్లీలో ఈ సిలిండర్ ధర రూ.942 ఉండగా, కేంద్రం ప్రధాన మంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై) పథకం కింద పేదలకు రూ.300 సబ్సిడీ ఇస్తోంది. దీంతో వారికి సిలిండర్ రూ.642కే లభిస్తోంది. ఇటీవల గల్ఫ్ సంక్షోభం ప్రారంభమైనప్పటి నుంచి మన దేశానికి చమురు అందించే సౌదీ కాంట్రాక్ట్ ప్రైస్ (సీపీ) ధర 46 శాతం పెరిగింది. హార్మూజ్ జలసంధి మూసివేయడం, చమురు సరఫరా రవాణాకు ఆటంకాలు ఏర్పడటం కారణంగా అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరిగాయి.

# 12 ఏళ్లు పూర్తి చేసుకున్న ఎన్‌డీయే..

-కూటమి పక్షాలతో మీటింగ్..
-ఇండియా బ్లాక్ సమావేశం తర్వాత కీలకం కానున్న భేటీ



**న్యూఢిల్లీ:జూన్ 9( మహాప్రభ)**
కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్‌డీయే కూటమి 12 ఏళ్లు అధికారం పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా బుధ, గురు వారాల్లో ఎన్‌డీయే పక్షాల కీలక భేటీ జరగనున్నట్లు తెలుస్తోంది. 12 ఏళ్లు పూర్తైన సందర్భాన్ని సెలబ్రేట్ చేసుకోవడంతోపాటు, భవిష్యత్‌లో ఎలా కలిసి ముందుకు వెళ్లాలి అనే అంశాలపై ఈ భేటీ జరగనుంది. ఇప్పటికే ఎన్‌డీయేకు చెందిన నేతలు సమావేశం కోసం ఢిల్లీ చేరుకున్నారు.ఃమంగళవారం కూడా సమావేశం జరిగే అవకాశం ఉంది. ఇక గురువారం ప్రధాని మోదీ.. ఎన్‌డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలతో కూడా భేటీ కానున్నారు. తమ పాలన ఉన్న రాష్ట్రాల్లో వికసిత్ భారత్ కోసం ఎలా పని చేయాలి, పశ్చిమాసియా సంక్షభాన్ని ఎలా ఎదుర్కోవాలి వంటి అంశాలపై మోదీ వారితో చర్చించే అవకాశం ఉంది. ఇప్పటికే దేశంలో చమురు ధరలు పెరగడం వల్ల ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అలాగే, ద్రవ్యోల్బణం కూడా సమస్యగా మారుతోంది. ఈ పరిస్థితిని ఎదుర్కునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రధాని చర్చిస్తారు. మరోవైపు రాజకీయంగానూ ఈ భేటీ ఎన్‌డీయేకు చాలా కీలకం. ఇండియా కూటమి పక్షాల భేటీ సోమవారం ఢిల్లీలో జరిగిన సంగతి తెలిసిందే. డీఎంకే, ఆప్, కమ్యూనిస్ట్ పార్టీలు మినహా ఎక్కువ పార్టీలు ఈ భేటీకి హాజరయ్యాయి. దీంతో ఇండియా కూటమి భవిష్యత్‌లో బలంగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే ఎన్‌డీయే భేటీ చాలా కీలకంగా మారనుంది. ఏపీలో ఎన్‌డీయే కూటమి అధికారంలో ఉన్న సంగతి తెలిసిందే. దీంతో ఢిల్లీలో జరిగే సమావేశానికి ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరవుతారు. ప్రధానితో భేటీ అనంతరం వీరు నీతి అయోగ్ సమావేశంలో కూడా పాల్గొంటారు.

# డీకే శివకుమార్‌కు ఇంకా తగ్గని తలనొప్పులు..



**న్యూఢిల్లీ:జూన్ 9( మహాప్రభ)**
కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన డీకే శివకుమార్ కు సొంత పార్టీ నేతల నుంచి తలనొప్పులు ఇంకా తగ్గలేదు. శాఖల కేటాయింపుపై అసంతృప్తి వ్యక్తంచేస్తూ మరో మంత్రి అలకబూనారు. అంతేకాదు అధిష్ఠానంతో చర్చల కోసం ఆయన ఢిల్లీకి బయలుదేరారు. మంత్రి కృష్ణబైరె గౌడ కు గ్రేటర్ బెంగళూరు అభివృద్ధి శాఖను కేటాయించారు. అయితే ఆ శాఖలోని బెంగళూరు అభివృద్ధి అథారిటీ, బెంగళూరు మెట్రోపాలిటన్ ప్రాంత అభివృద్ధి అథారిటీ వంటి కీలక విభాగాలను మాత్రం సీఎం తన వద్దే ఉంచుకున్నారు. దీనిపై కృష్ణ బైరె గౌడ అసంతృప్తిగా ఉన్నారు.దీనిపై సీఎం డీకే శివకుమార్‌ను కూడా ఆయన కలిశారు. ఈ సమస్యపై పూర్తి పరిష్కారం వచ్చిన తర్వాతే బాధ్యతలు తీసుకుంటానని కృష్ణ బైరె గౌడ స్పష్టంచేశారు. ఢిల్లీకి వెళ్లిన ఆయన.. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలతో భేటీ కానున్నట్లు తెలుస్తోంది. ఇదిలావుండగా నగరాభివృద్ధి శాఖను తనకు కేటాయించకపోవడంపై ఇటీవల సీనియర్ నేత రామలింగారెడ్డి అసంతృప్తి వ్యక్తంచేశారు. ఆయన ప్రమాణం చేసిన రెండు రోజుల్లోనే నీటిపారుదల శాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత పార్టీ ఆయనకు నచ్చజెప్పడంతో రాజీనామాను వెనక్కి తీసుకున్నారు. ఇప్పుడు ఆ నగరాభివృద్ధి శాఖ కేటాయించినా కృష్ణ బైరె గౌడ అసంతృప్తిగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. ఇలా కొందరు తమకు కేటాయించిన శాఖలపై అసంతృప్తి వ్యక్తంచేస్తుంటే.. మరికొందరు ఎమ్మెల్యే మంత్రివర్గంలో చోటుదక్కకపోవడంపై అసంతృప్తిగా ఉన్నారు. శాఖల విషయంలో అసంతృప్తితో ఉన్నవారితో పాటు.. మంత్రివర్గంలో చోటు కోసం అభ్యర్థించేందుకు ఎమ్మెల్యేలు ఢిల్లీ బాట పట్టారు. డీకేకు అత్యంత సన్నిహితుడిగా పేరొందిన ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్ కూడా ఢిల్లీకి వెళ్లారు.

# కాంగోలో 100 దాటిన ఎబోలా మృతుల సంఖ్య



**బునియా జూన్ 9( మహాప్రభ)**
డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో ఎబోలా వైరస్ వల్ల మృతిచెందిన వారిన సంఖ్య 101కి చేరుకున్నది. ఆ దేశంలోని ఇటురి ప్రావిన్సులో ఎబోలా వైరస్ వేగంగా విస్తరిస్తోంది. అయితే అక్కడ ఉన్న సాయుధ గ్రూపుల వల్ల వైరస్ నియంత్రణ కష్టసాధ్యంగా మారుతోంది. తాజాగా ప్రభుత్వం కొత్త నివేదికను రిలీజ్ చేసింది. 550 పాజిటివ్ కేసుల్లో మృతుల సంఖ్య వందకు చేరినట్లు ప్రభుత్వం ప్రకటించింది. కొత్తగా 10 మంది మృతిచెందగా, 35 కొత్త కేసులు నమోదు అయినట్లు ప్రభుత్వం చెప్పింది. ఎబోలాలోని బుందిబుగ్యో స్ట్రెయిన్ మహమ్మారిలా మారినట్లు మే 15వ తేదీన ప్రభుత్వం ప్రకటించింది.ఆరంభంలో ఎబోలా కేసులను గుర్తించడంలో ఆలస్యం కావడం వల్ల ఇప్పుడు పరిస్థితిన అదుపులోకి తేవడం కష్టంగా మారింది. ఇటురి, నార్త్ కివు, సౌత్ కివు ప్రావిన్సుల్లో ఎక్కువగా ఎబోలా కేసులు నమోదు అవుతున్నాయి. అయితే జుగు, ఇరుము, మాంబసా ప్రాంతాల్లో సాయుధ గ్రూపులు ఉండడం వల్ల అక్కడ వైరస్‌ను అదుపు చేయడం అసాధ్యమవుతోంది. మూడు కీలకమైన ప్రావిన్సుల్లో సుమారు 120 సాయుధ దళాలు ఉన్నాయని, వర్గ పోరు, రాజకీయ ప్రత్యర్థులు, అవినీతి వల్ల అక్కడ హింస పెరుగోతంది. దీంతో ఎబోలా కేసులను గుర్తించి, నియంత్రించడం పెను సవాల్‌గా మారింది. కాంగోలో సుమారు 10 కోట్ల జనాభా ఉంటుంది. అక్యడ ఈ వైరస్ వ్యాపించడం ఇది 17వ సారి. 1976లో తొలిసారి ఎబోలా వైరస్‌ను గుర్తించారు. ప్రస్తుతం బుందిబుగయో స్ట్రెయిన్ ఎక్కువగా వ్యాపిస్తున్నట్లు తెలుస్తోంది. పొరుగు దేశం ఉగాండా నుంచి ఆ వైరస్ స్ట్రెయిన్ వ్యాప్తి జరిగినట్లు భావిస్తున్నారు.

# మమతా బెనర్జీ నివాసంలో సిఐడి సోదాలు




**కోల్ కతా జూన్ 9( మహాప్రభ)**
మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నివాసంలో సిఐడి సోదాలు చేపట్టింది. పార్టీ ఎమ్మెల్యే సంతకాలను ఫోర్జరీ చేశారన్న ఆరోపణలకు సంబంధించి, పశ్చిమబెంగాల్ పోలీస్ క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ (సిఐడి) మంగళవారం 30బి, హరీష్ చటర్జీ వీధిలోని మమతా బెనర్జీ నివాసానికి చేరుకుంది. అయితే ఈ చిరునామా పార్టీ కార్యాలయంగా నమోదై ఉంది. దీంతో అక్కడికి చేరుకున్న సిఐడిని పార్టీ కార్యకర్తలు అడ్డుకున్నారు. కొంత సేపు వాగ్వివాదం అనంతరం సిఐడి బృందం ఆ నివాసంలో సోదాలు చేపట్టింది. మమతా బెనర్జీ, ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీ ఇద్దరూ ఇంట్లో లేనందున సిఐడి అధికారులను లోపలికి అనుమతించలేమని టిఎంసి మాజీ ఎంపి సుభాశిష్ తెలిపారు. వారు నివాసంలో ఉన్న సమయంలో, రెండు రోజుల తర్వాత తిరిగి రావాలని అధికారులను కోరారు. తమ దర్యాప్తుకు సుభాశిష్ ఆటంకం కలిగిస్తున్నారని సిఐడి అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఇరువురి మధ్య కొంత సేపు వాగ్వివాదం నెలకొంది.

# దుబాయ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..

- తెలంగాణకు చెందిన ముగ్గురు కార్మికులు మృతి



**న్యూఢిల్లీ:జూన్ 9( మహాప్రభ)**
దుబాయ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. మినీ బస్సు, ట్రక్కు ఢీ కొన్న ఘటనలో తెలంగాణకు చెందిన ముగ్గురు కార్మికులతో పాటు మరో నలుగురు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళ్తే..దుబాయ్‌లోని అత్యంత రద్దీగా ఉండే ఎమిరేట్స్ రోడ్డుపై సోమవారం వేగంగా వస్తున్న మినీబస్సు ట్రక్కును ఢీకొనడంతో ఏడుగురు మృతి చెందగా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు హాస్పిటల్‌కు తరలించారు. మృతులను జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి మండలానికి చెందిన అబ్దుల్ రఫీక్, కొడిమ్యాల మండలానికి చెందిన సయ్యద్ సలీం, మల్యాల మండలానికి చెందిన గజుల తిరుపతిగా గుర్తించారు.

# డ్రైవింగ్ లైసెన్స్ నిబంధనల్లో భారీ మార్పులు..

## వ్యాలిడిటీ 50 ఏళ్లకు పెంపు?




**న్యూఢిల్లీ:జూన్ 9( మహాప్రభ)**
డ్రైవింగ్ లైసెన్స్ జారీ, పునరుద్ధరణ (రెన్యూవల్) ప్రక్రియలో సమూల మార్పులకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల్లో మార్పులు చేస్తూ, డ్రైవింగ్ లైసెన్స్ వ్యాలిడిటీని ఏకంగా 50 ఏళ్లకు పెంచే అంశాన్ని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు కసరత్తు మొదలైందని జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి.

# పీఓకేలో రక్తపాతం

**-నిరసనకారులపై పాక్ బలగాల కాల్పులు..**
**-30 మంది మృతి.. 200 మందికి పైగా గాయాలు**
**- ముజఫరాబాద్, రావలకోట్‌లో ఉద్రిక్త పరిస్థితులు**
**- హక్కుల కోసం పోరాటం.. అణచివేతకు దిగిన పాక్ బలగాలు**

**ఇస్లామాబాద్**



పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ని నిరసనకారులపై పాకిస్థాన్ భద్రతా దళాలు ఫైరింగ్‌కు పాల్పడ్డాయి. ఈ ఘటనలో సుమారు 30 మంది మృతిచెందగా, మరో 200 మంది గాయపడ్డారు. పాకిస్థాన్ నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేస్తున్న ఆందోళనకారులపై భద్రతా దళాలు కాల్పులు జరిపాయి. రావల్‌కోట్, బింబేర్, ముజాఫరాబాద్‌లో పరిస్థితి దారుణంఅ ఉంది. పాక్ దళాలు చాలా క్రూరంగా ఫైరింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. టియర్ గ్యాస్‌తోనూ నిరసనకారుల్ని చెదరగొట్టారు.జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ(జేఏఏసీ) అనే సంస్థ ఇచ్చిన ఆందోళన మేరకు జనం నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఆర్థిక, రాజకీయ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఓ ఆస్పత్రి మార్చురీ వద్ద భారీ సంఖ్యలో జేఏఏసీ కమిటీ మద్దతుదారులు చేరుకున్నారు. నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఆ సమయంలో గ్రూపులోని కొందరు ఆటోమెటిక్ రైఫిళ్లు, పెట్రోల్ బాంబులను వాడారు. జూలై 27వ తేదీన జరగనున్న ప్రాంతీయ ఎన్నికల్లో శరణార్థులకు 12 సీట్లు కేటాయించరాదు అని జేఏఏసీ పేర్కొన్నది

# దేశ ద్రోహులకు స్థానం లేదు

**-భారత్ ధర్మసత్రం కాదు**
**-లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**
**-ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్**




**లక్నో**

దేశ సంస్కృతి, సంప్రదాయాల పట్ల విశ్వాసం లేని వారికి భారతదేశం ఎంతమాత్రం ధర్మశాల కాదని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. లఖ్‌నవూలో మంగళవారంనాడు జరిగిన శ్రీరామకథా మహోత్సవం ముగింపు వేడుకలో ఆయన మాట్లాడుతూ, శ్రీరాముని ఆదర్శాలు యావద్దేశాన్ని ఏకం చేస్తున్నాయని చెప్పారు. 'భారతదేశం ఎంతమాత్రం ధర్మశాల కాదు. దేశ సంస్కృతి, వారసత్వం, విలువలను గౌరవించే వాళ్లు మాత్రమే ఇక్కడ గౌరవప్రదంగా జీవించవచ్చు. భారతదేశ స్ఫూర్తి, సంప్రదాయాలను అంగీకరించని వాళ్లకి ఇక్కడ స్థానం లేదు' అని యోగి ఆదిత్యనాథ్ అన్నారు. రామాయణ కాలానికి, నవీన భారతానికి మధ్య సారూప్యాన్ని వివరిస్తూ, దుష్టశక్తులు అధికారంలో ఉన్నప్పుడల్లా రాక్షసరాజు రావణాసురిడి కాలంలో ఏవిధంగా దుష్టశిక్షణ జరిగిందో అదే పునరావృతమవుతుందని అన్నారు.‚ ÷శంలోని జనాభా మార్పు కోసం జరుగుతున్న కుట్రలో భాగమే 'లవ్ జిహాద్' అని యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. రామాయణ కాలంలో కూడా ఖాళీగా ఉన్న భూములను మారీచుడు, ఖరదూషణాది రాక్షసులు దురాక్రమణ చేసేవారని, ల్యాండ్ జిహాద్‌కు పాల్పడేవారని అన్నారు. ప్రతి యుగంలోనే దుష్టశక్తులు ఉంటాయని, అయితే సత్యం, మతం పరిరక్షణకు శ్రీరాముడు ఏవిధంగా పాటుపడ్డారో అందరూ తెలుసుకుని కర్తవ్యబద్ధులుకావాలని, అంతా ఐక్యంగా నిలవాలని అన్నారు.

# విజయన్ కుమార్తెకు ఈడీ సమన్లు

**మనీలాండరింగ్ కేసులో 12న విచారణకు హాజరు కావాలంటూ ఆదేశం**

**తిరువనంతపురం**



ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోయిన కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కుమార్తె వీణాకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. మనీలాండరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆమెను ప్రశ్నించేందుకు ఈ నెల 12న కొచ్చిలోని తమ జోనల్ కార్యాలయానికి హాజరు కావాలని కోరింది. పీఎంఎల్ఏ చట్టం కింద ఆమె స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయనున్నట్టు అధికారులు తెలిపారు.వీణాతో పాటు మరికొందరికి కూడా ఈడీ సమన్లు జారీ చేసింది. కేరళకు చెందిన ఇసుక వెలికితీత సంస్థ కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్), వీణాకు చెందిన మూతపడిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లు మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు ఈడీ ఆరోపణలు నమోదు చేసింది.

## ప్రాజెక్టులకు అడ్డుపడ్డానని నిరూపిస్తావా

మొదటి తరువాయి

రెడ్డి బెదిరింపులకు తాను భయపడే వ్యక్తిని కానన్నారు. సీఎం రేవంత్ పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సీఎం స్థాయిని మరిచి మాట్లాడుతున్నారంటూ రేవంత్‌రెడ్డిపై కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్ రెడ్డిలాగా తాను మాటకారిని కాను.. కానీ మాటపై నిలబడే వ్యక్తిని అని కిషన్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. పదవులు, అధికారం కోసం మాటలు మార్చే వ్యక్తిని తాను కానని స్పష్టం చేశారు. చిల్లర రాజకీయాలు చేయడం తనకు అలవాటు లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ఎక్కడైనా తాను చర్చకు సిద్ధమని అధికార పార్టీ నేతలకు కిషన్‌రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. మీరిచ్చిన ఏ గ్యారంటీ అయినా అమలు చేశారా? అంటూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని వ్యంగ్యంగా అన్నారు. దోచుకోవడం, దాచుకోవడం, ప్రజలను వంచించడంలో.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందేనని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. బీజేపీ నేతలను సీఎం రేవంత్ రెడ్డి బెదిరిస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను గమనించాలంటూ తెలంగాణ సమాజానికి ఈ సందర్భంగా సూచించారు. సీఎం రేవంత్‌కు తాము గులాంలు కామన్నారు. తనకు సీఎం రేవంత్‌రెడ్డి సర్టిఫికెట్ అవసరం లేదని మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

## హెచ్1 బి వీసాపై ట్రంప్‌కు షాక్

మొదటి తరువాయి



చట్ట విరుద్ధమైన పన్ను అని ప్రకటిస్తూ ఆ నిబంధన చెల్లదని కొట్టిపారేశారు. కోర్టు తీసుకున్న ఈ నిర్ణయంతో ఐటీ సహా పలు రంగాలకు చెందిన వేలాది మంది విదేశీ నిపుణులకు, ముఖ్యంగా భారతీయ టెక్కీలకు పెద్ద ఊరట లభించింది.

# ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు పెద్దపీట

**-మహిళా సాధికారతకు మరో అడుగు**
**-వారిని కోటీశ్వరులను చేసే పనిలో వెనకడుగు లేదు**
**-మహిళల స్ఫూర్తితోనే తమ ప్రజాపాలన సాగుతోంది**
**-వారి దెబ్బకే కొందరు ఫామ్‌హౌజ్‌కు పరిమితం అయ్యారు**
**-కెసిఆర్ హయాంలో మంత్రి పదవులు కూడా ఇవ్వలేదు**
**-బిజెపి కనీసం మహిళకు అధ్యక్ష పదవి ఇవ్వలేదు**
**-పరేడ్ గ్రౌండ్స్ సభలో సిఎం రేవంత్ రెడ్డి**



హైదరాబాద్

మహిళా సాధికారతకు తమ సర్కార్ మరో కీలక అడుగు వేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం.. మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేస్తున్నామని ఉద్ఘాటించారు. మహిళా శక్తి పథకం కింద 553 బస్సులు పంపిణీ చేశామని వ్యాఖ్యానించారు. మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ అని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బస్సులను సీఎం ప్రారంభించి ప్రసంగించారు. దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించింది కాంగ్రెస్సేనని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. బీజేపీ అధ్యక్ష పదవిని ఒక్కసారైనా మహిళకు ఇచ్చారా అని ప్రశ్నించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నామని వివరించారు. మహిళలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలోని తొలి ఐదేళ్లలో ఒక్క మహిళకైనా మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తమ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రి పదవులు ఇచ్చామని ప్రస్తావించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నామని వివరించారు. మహిళలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. మహిళా సంఘాల్లో 67 లక్షల మంది ఆడబిడ్డలు ఉన్నారని తెలిపారు. ఆడబిడ్డలతో పెట్టుకుంటే అధికారంలో ఉంటారా? అని ప్రశ్నించారు. తమ అక్కలు పెట్టిన వాతలతోనే కొందరు ఫామ్‌హౌస్‌లో పండుకున్నారని విమర్శించారు. ఉచిత బస్సుతో స్కూళ్లలో ఆడపిల్లల డ్రాపౌట్స్ తగ్గాయని అన్నారు. ఉచిత బస్సు పథకం కోసం రూ.10 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. కడుపు నిండా విషం పెట్టుకుని ఉచిత బస్సు పథకం ఆపాలని కొంతమంది చూశారని ధ్వజమెత్తారు. ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టి రోడ్డుపైకి పంపారని సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహించారు. 27 వేల స్కూళ్ల నిర్వహణ బాధ్యత కూడా ఆడబిడ్డలకు అప్పగించామని తెలిపారు. మిడ్ డే మీల్ పథకం సరుకులు కూడా మహిళలే సరఫరా చేస్తున్నారని వెల్లడించారు. పెట్రోల్ బంకుల నిర్వహణ అప్పగించడంతో లక్షలు సంపాదిస్తున్నారని చెప్పుకొచ్చారు. 8 వేల స్త్రీ శక్తి భవనాలు ఒకేసారి పూర్తిచేస్తామని అన్నారు. కార్పొరేట్ ఆఫీస్‌ల కంటే మిన్నగా స్త్రీ శక్తి భవనాలు ఉంటాయని వివరించారు. హైటెక్ సిటీ దగ్గర మహిళలకు రూ.1000 కోట్ల భూమి కేటాయించామని ప్రస్తావించారు. 106 స్టాల్స్‌తో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో మాల్ నిర్మించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులుగా మారుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. దళారులు, దోపిడీదారులకు తమ ప్రభుత్వంలో చోటులేదని స్పష్టం చేశారు. 2034 వరకు ప్రజాప్రభుత్వం కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఆడబిడ్డలకు అండగా ఉండే బాధ్యత తమదని తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసినా మహిళా సంఘాలను ఆదుకుంటున్నామని చెప్పుకొచ్చారు. రూ.60 వేల కోట్ల రుణాలతో ఆర్థికంగా నిలబెడుతున్నామని తెలిపారు. ఆడబిడ్డలు సంతోషంగా ఉండాలని మంచి చీరలు ఇస్తున్నామని వివరించారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన చీరలను ఎవరైనా కట్టుకున్నారా? అని ప్రశ్నించారు. ఆడబిడ్డల సంక్షేమానికి అన్నివేళలా కృషిచేస్తామని తెలిపారు. పంట మార్పిడి విషయంలో మహిళలు చొరవ చూపాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. మన సంస్కృతి, సంప్రదాయల్లో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు గుర్తింపు ఉంటుంది. మహిళలకు ఇవ్వాల్సిన రూ.4వేల కోట్ల సున్నా వడ్డీ నగదును గత ప్రభుత్వం చెల్లించలేదు. మహిళలతో పెట్టుకున్న ఎవరైనా అధికారంలో ఉంటారా? మహిళలతో పెట్టుకున్నందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయింది. మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం ఆర్టీసీకి రూ.10,500 కోట్లు చెల్లించాం' అన్నారు. అందరికంటే ముందుంటామని మహిళలు నిరూపిస్తున్నారు. వ్యవసాయానికి ప్రాణవాయువు ఆడబిడ్డలు. ఆడబిడ్డ పుడితే.. మహాలక్ష్మి వచ్చిందని సంతోషపడే సంస్కృతి మనది. మన సంస్కృతి, సంప్రదాయాల్లో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత ఇందిరాగాంధీకి దక్కుతుంది. మహిళలను స్ఫూర్తిగా తీసుకొని మేం పరిపాలన చేస్తున్నాం. అమెరికాలో మహిళలకు ఓటు హక్కు వచ్చేందుకు వందల ఏళ్లు పట్టింది. భారత్‌కు స్వాతంత్య్రం రాగానే మహిళలకు ఓటు హక్కు ఇచ్చిన ఘనత నెహ్రూకే దక్కుతుందని రేవంత్ అన్నారు. స్థానిక ఎన్నికల్లో మహిళలకు రాజీవ్‌గాంధీ రిజర్వేషన్లు ఇచ్చారు. సోనియా గాంధీ 2013లో చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వాలని బిల్లు ప్రవేశపెట్టారు. అంబానీ, ఆదానీలకు పోటీగా పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్‌ను రాష్ట్ర మహిళలు నిర్వహిస్తున్నారు. త్వరలోనే మహిళా శక్తి భవనాలు నిర్మిస్తామని అన్నారు.

# ధాన్యం కొనుగోళ్లపై కేంద్రం తిరకాసు

మొదటి తరువాయి

ఉందన్నారు. నాగర్ కర్నూల్ జిల్లాలో ఇంకా పంట సాగవుతుందని చెప్పారు. ప్రతిపక్షాలు చెప్పేవన్నీ అబద్దాలేనని పేర్కొన్నారు. పౌర సరఫరాల శాఖ కార్యాలయం నుంచి నేరుగా ఆన్‌లైన్‌లో రైతులు, మహిళా సంఘాల అకౌంట్‌లో నగదు వేస్తున్నామని చెప్పారు. మహిళ సంఘాలకు కేంద్ర ప్రభుత్వం నిధుల నుంచి రూ.170 కోట్లు చెల్లించామని వివరించారు. 8 లక్షల మెట్రిక్ టన్నుల మొక్క జొన్న కూడా కొనుగోలు చేశామని తెలిపారు. క్వింటాకు రూ.1000 నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇంత బాధ్యతగా కొనుగోలు చేయలేదని చెప్పారు. భవిషత్తులో పాడి ప్రోక్యూర్‌మెంట్‌లో ఏ విధంగా పోవాలని దేశంలో వివిధ రాష్ట్రాల్లో ప్రత్యేక బృందాలు పర్యటిస్తున్నాయని వివరించారు. రాష్ట్రంలో హమాలీల సమస్య అధికంగా ఉందన్నారు. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న స్టోరేజ్ సరిపోవడం లేదన్నారు. బుధవారం మేడిగడ్డలో మూడు బ్యారేజీల టెస్టింగ్ పక్రియపై సమీక్ష చేస్తామని చెప్పారు. ఈ మూడు బ్యారేజిల్లో నీళ్లు నింపొద్దని ఇప్పటికే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఎన్‌డీఎస్ఏ చెప్పిందని గుర్తు చేశారు. మేడిగడ్డలో నీళ్లు నింపితే కొట్టకుపోతాయని ఎన్‌డీఎస్ఏ స్పష్టం చేసిందన్నారు. దేశంలోనే రికార్డ్ స్థాయిలో తెలంగాణలో ధాన్యం కొనుగోళ్లు చేశామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెంగాణలో ఎక్కువ ధాన్యం ఉత్పత్తి అయ్యిందని.. యాసంగిలో రికార్డ్ స్థాయిలో ధాన్యం కొన్నామని చెప్పారు. రబీ, ఖరీఫ్ సీజన్ కలిపి 147 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని.. ఇన్ని టన్నుల ధాన్యం సేకరణ దేశంలోనే రికార్డ్ అని తెలిపారు. వడ్ల కొనుగోళ్లకు సంబంధించి రూ.35,077 కోట్లు రైతుల ఖాతాలో వేశామన్నారు. 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని.. రైతులకు ఇబ్బంది లేకుండా స్థానికంగా ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం 52 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ టార్గెట్ పెట్టిందని.. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 75 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించిందని తెలిపారు. తెలంగాణ పొరుగు రాష్ట్రం ఏపీలో 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు మాత్రమే జరిగిందని పేర్కొన్నారు. దేశంలో ఉత్పత్తి అయ్యే వరిలో 61 శాతం తెలంగాణలోనే అవుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు ద్వారా మహిళా సంఘాలు, పీఏసీలను బలపరుస్తున్నామన్నారు.

# లక్షద్వీప్‌లో మద్యం అమ్మకాలకు గ్రీన్‌సిగ్నల్

**-47 ఏండ్ల నిషేధం ఎత్తివేత..**
**-1979 నాటి పాత చట్టాన్ని రద్దు చేసిన కేంద్రం**
**-లైసెన్స్ ఉంటేనే ఇకపై మద్యం విక్రయాలు**
**-విదేశీ లిక్కర్‌పై 400%, బీర్లపై 200 శాతం ఎక్సైజ్ సుంకం!**
**- మాల్దీవులకు పోటీగా టూరిజం హబ్**
**- స్థానిక సెంటిమెంట్లు దాటి కేంద్రం కీలక నిర్ణయం**



**న్యూఢిల్లీ:**

ముస్లింలు అధికంగా నివసించే కేంద్రపాలిత ప్రాంతమైన లక్షద్వీప్‌లో ఆల్కహాల్ అమ్మకాలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పర్యాటకాభివృద్ధి లక్ష్యంగా గత 47 ఏండ్లుగా కొనసాగుతున్న నిషేధాన్ని ఎత్తివేసింది. ఈ మేరకు 1979లో అమల్లోకి వచ్చిన 'లక్షద్వీప్ ప్రొహిబిషన్ రెగ్యులేషన్'ను రద్దు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో నియంత్రిత విధానంలో లైసెన్స్ పొందిన దుకాణాల ద్వారా మద్యం విక్రయాలకు మార్గం సుగమమైంది. కొత్తగా అమల్లోకి వచ్చిన లక్షద్వీప్ ఎక్సైజ్ రెగ్యులేషన్ 2026 ప్రకారం మద్యం తయారీ, దిగుమతి, ఎగుమతి, రవాణా, కొనుగోలు, విక్రయాలు, వినియోగం వంటి అంశాలు అన్నింటినీ లైసెన్సింగ్ వ్యవస్థ ద్వారా నియంత్రించనున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు కూడా మద్యం దిగుమతి, రిటైల్ విక్రయాలకు అనుమతి పొందే వెసులుబాటు కల్పించింది. **భారీగా పన్నులు** అయితే మద్యం అందుబాటులోకి తెస్తున్నప్పటికీ అధిక పన్నులు విధించారు. ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ , విదేశీ మద్యంపై 400 శాతం, బీర్లపై 200 శాతం, వైన్‌పై 80 శాతం వరకు ఎక్సైజ్ సుంకం విధించారు. అలాగే 21 ఏండ్లలోపు వారికి మద్యం విక్రయించడంపై నిషేధం ఉంచారు. అవసరమైతే లక్షద్వీప్‌లోని ఏదైనా ప్రాంతంలో మళ్లీ నిషేధం విధించే అధికారం అడ్మినిస్ట్రేటర్‌కు ఉంటుంది.

**లక్షద్వీప్‌లో మద్యంపై నిషేధం ఎందుకు?**

లక్షద్వీప్‌లో సుమారు 97 శాతం జనాభా ముస్లింలే. భారతదేశంలోని ఏ రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతంతో పోల్చినా ఇది చాలా అధికం. ఇస్లాం మతంలో మద్యపానాన్ని నిషేధించిన నేపథ్యంలో 1979 నుంచి లక్షద్వీప్‌లో మద్యం అమ్మకాలపై నిషేధం అమలు చేశారు. అయితే ఈ నిషేధం పూర్తిస్థాయిలో లేదు. పర్యాటకులు, ప్రభుత్వ అధికారుల కోసం కొన్ని మినహాయింపులు ఉండేవి. కానీ లక్షద్వీప్‌ను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం మద్యపానంపై నిషేధాన్ని ఎత్తివేసింది. మాల్దీవులు వంటి సముద్ర ద్వీప పర్యాటక కేంద్రాలతో పోటీ పడాలంటే నిషేధం అడ్డంకిగా మారుతుందని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

## నైరుతి ఆగమనంతో పలకరించిన తొలకరి

మొదటి తరువాయి

పలుచోట్ల రహదారులపై వర్షం నీరు చేరింది. ముషీరాబాద్‌లో ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. భాగ్యనగరంలో భారీ వర్షం కురుస్తోండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. సిటీలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతోండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లపై భారీగా వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా లోతట్టు కాలనీలు, ప్రధాన రహదారులు, కూడళ్లలో నీరు చేరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పంజాగుట్ట, ఖైరతాబాద్, బంజారాహిల్స్, యూసఫ్‌గూడ, టోలీచౌకి, ఫిలింనగర్, అమీర్‌పేట్, ఎస్సార్‌నగర్, ఎర్రగడ్డ, సనత్‌నగర్ తదితర ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. పలు ప్రాంతాల్లో వాహనాలు నెమ్మదిగా సాగుతుండగా, కొన్ని చోట్ల ట్రాఫిక్ జాం అయింది. కార్యాలయాలు, విద్యాసంస్థల నుంచి ఇళ్లకు వెళ్లే ప్రజలు వర్షం కారణంగా ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపడుతూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని, వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లో జాగ్రత్తగా ప్రయాణించాలని అధికారులు సూచిస్తున్నారు. వాతావరణ శాఖ అధికారులు మరికొన్ని గంటల పాటు నగరంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ స్తంభాలు, చెట్లు, నీటితో నిండిన ప్రాంతాల వద్ద జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భారీ వర్షాల ప్రభావంతో నగరంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తెలంగాణలో బుధవారం కూడా పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో నేడు అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు తెలిపింది. గంటకు 40 నుంచి 50కి.మీ వేగంతో ఈదురుగాలులతో వర్షాలు పడొచ్చని పేర్కొంది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్ జిల్లాలకు మోస్తరు వర్ష సూచన ఉన్నట్లు తెలిపిన వాతావరణ శాఖ అధికారులు.. కామారెడ్డిలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే, బుధవారం వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు.

## 18 గంటలు పనిచేస్తున్నాం

మొదటి తరువాయి

ఆరోపించారు. మంగళవారం నాడు జిల్లాలోని చిల్పూర్ మండలం పల్లగుట్టలో పర్యటించిన భట్టి.. 33/11కెవి సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు పేదలకు సన్నబియ్యం ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధి, సంక్షేమం ఆపడం లేదని డిప్యూటీ సీఎం వెల్లడించారు. 76 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. కేంద్ర ప్రభుత్వం వడ్లను ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. కార్పోరేట్ శక్తుల దయాదక్షిణ్యాల కోసం రైతులు ఎదురు చూసేలా కేంద్రం చేస్తోందని విమర్శించారు. ఏ రాష్ట్రంలోనూ వడ్ల కొనుగోళ్లు జరగడం లేదన్నారు. తాము మొక్కజొన్నలు కూడా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఉచిత విద్యుత్ ఇచ్చింది కానీ డిస్కమ్‌లకు డబ్బులు చెల్లించలేదన్నారు. కానీ ఇప్పుడు డిస్కమ్‌లకు డబ్బులు చెల్లిస్తున్నామని అన్నారు. ఎన్నికల సందర్భంగా నేను, సీఎం ఇక్కడి ప్రజలకు హామీలు ఇచ్చాం. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం' అని భట్టి తెలిపారు. దేవాదుల ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని వ్యాఖ్యానించారు. దేవాదుల ప్రాజెక్టు పనులు త్వరలోనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు.. తడిసిన ధాన్యాన్ని కూడా కొంటున్నామన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం ఒకప్పుడు వలసల ప్రాంతమని.. కానీ ఇప్పుడు అభివృద్ధి జరుగుతోందన్నారు. రఘునాథపల్లిలో 230ఐ÷ఎ సబ్ స్టేషన్ ఏర్పాటును పరిశీలిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. తడిచిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. 72 లక్షల టన్నుల ధాన్యం సేకరించి రూ.14వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం.

## సంపాదకీయం

# యువజన గళం




ఒకవైపు ఉద్యోగాలు లేవు. మరోవైపు ఉన్నత విద్యకు ద్వారాలుగా భావించే పరీక్ష?లకు భద్రత లేదు. లక్ష?లాది మంది యువతకు భవిష్యత్తు లేదు. మరి నిరుద్యోగులు ఏం చేయాలి? నీట్ వంటి పరీక్ష?లు లీకేజీలకు బలవుతుంటే, సంవత్సరాల శ్రమతో సిద్ధమైన విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే, బాధ్యత వహించాల్సిన పాలకులు తప్పించుకుంటుంటే విద్యార్థి యువత ఇంకేం చేస్తుంది? వారికీ ఆగ్రహం, ఆవేదన ఉంటాయి. వాటికి ప్రతిబింబమే మొన్న ఢిల్లీ 'జంతర్ మంతర్' వద్ద వినిపించిన నిరసన స్వరం. వేలాది మంది విద్యార్థులు, యువకులు, పాల్గొని నినదించడం సాధారణ పరిణామం కాదు, ఎన్నో ఏండ్ల నుంచి వారిలో దాగున్న నిరాశ, నిస్పృహలకు సంకేతం. ప్రధాని నరేంద్ర మోడీ 2014 ఎన్నికల సమయంలో ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆ లెక్కన ఇప్పటి వరకు ఇరవై నాలుగు కోట్లకు పైగా ఉద్యోగాలు ఇవ్వాలి. మరి ఇచ్చారా? లేదన్న సంగతి యువత నినా దంలోనే తెలుస్తోంది. పిఎల్ఎఫ్ఎస్ అధికారిక గణాంకాలు నిరుద్యోగిత రేటు 3.1శాతం మాత్రమే ఉన్నట్టు చెబుతున్నా, అదే నివేదికలో పదిహేను నుంచి ఇరవై ఏళ్ల యువతది 9.9శాతంగా ఉందని పేర్కొంది. కానీ స్వతంత్ర సర్వేలు అధికారిక సంఖ్య కంటే దాదాపు రెండింతలు ఎక్కువే ఉంటుందని చెప్పాయి. కనీసం వాస్తవాల్ని కూడా అంగీకరించని పాలన మనది. నిరుద్యోగం సామాజిక సమస్యగా మారడానికి కేంద్రమే కారణం. లక్ష?లాది ఖాళీలు పేరుకుపోయాయి. వాటిని భర్తీ చేయకపోగా 'మిర్చీలు, పకోడీలు' అమ్ముకోవడం కూడా ఒక ఉద్యోగమేనని సెలవిచ్చారు మన పాలకులు. వారిని నమ్మి ఓటేసినందుకు మిర్చీలు, పకోడీలు అమ్ముకుంటూ బతకాలా? ఇప్పటికే మోడీ పాలనలో ఎన్నో పరిశ్రమలు మూతపడ్డాయి, కార్మికులు రోడ్డున పడ్డారు. వారి కుటుంబాల పరిస్థితేమిటి? దేశ అభివృద్ధికి, తమ భవిష్యత్తుకు యువత విద్యనే ఆయుధంగా భావించింది. నీట్, జేఈఈ, యూపీఎస్సీ, ఎస్ఎస్సీ వంటి పరీక్షలకు సంవత్సరాల తరబడి సిద్ధమవుతోంది. కానీ ఒక పరీక్ష? లీక్ అయితే వారి భవిష్యత్తే ప్రశ్నార్థకమవుతోంది. నీట్ ప్రశ్నాపత్రం లీక్ కావడంతో పరీక్ష రద్దయి మళ్లీ నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ మరో విషాదకరమైన విషయం, విద్యార్థుల ప్రాణాలు పోతుండడం. కేరళలో పంతొమ్మిదేళ్ల ఐజా ఆర్. మహేశ్ అనే విద్యార్థిని నీట్ పరీక్ష ఒత్తిడి, అనిశ్చితి మధ్య ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు ఆమెను వైద్యురాలిగా చూడాలని కలలు కన్నారు. కానీ ప్రశ్నాపత్రాల లీకేజీ, మళ్లీ పరీక్ష, మానసిక ఒత్తిడి చివరకు ఆమె ప్రాణాన్ని బలిగొన్నాయి. ఒక్క ఐజా మాత్రమే కాదు. నీట్ లీకేజీ తర్వాత ఐదుగురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ మరణాలకు బాధ్యత ఎవరిదో వేరే చెప్పనక్కర్లేదు! ఇదేకాదు, గత కొన్నేళ్లుగా నీట్, జేఈఈ వంటి పోటీ పరీక్షల ఒత్తిడితో దేశవ్యాప్తంగా వందలాది మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రతి మరణం వెనుక ఒక కుటుంబం ఛిన్నాభిన్నమవుతోంది. ఒక తల్లి కన్నీళ్లు, ఒక తండ్రి విరిగిపోయిన ఆశలు, ఒక చెల్లి లేదా తమ్ముడి కోల్పోయిన బంధం దాగి ఉంటుంది. కానీ ప్రభుత్వాలు మాత్రం వీటిని గణాంకాలుగానే చూడటం విచారకరం. లీకేజీ వ్యవహారంలో సీబీఐ దర్యాప్తు కొనసాగుతుండగా అరెస్టులు కూడా జరిగాయి. నిందితుడు ఆరెస్సెస్ సంబంధికుడని తేలింది. కానీ, కేంద్రం బాధ్యత నుంచి తప్పించుకుంటోంది. 'ఈ లీకేజీ వ్యవహారంతో నాకేం సంబంధం, ఏదైనా ఉంటే అధికార యంత్రాంగం చూసుకుంటుంది' అన్నట్టు కేంద్ర విద్యామంత్రి ధోరణి ఉంది. ఇలాంటి నేతలు ఉన్నప్పుడు విద్యార్థులు వీధుల్లోకి రాకుండా ఏం చేస్తారు? వారికి కావాల్సింది న్యాయం. అందుకే జంతర్ మంతర్ వద్ద యువత చేపట్టిన నిరసన ఒక జ్వాలగా ఎగిసిపడింది. విద్యార్థుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కూడా అందులో పాల్గొనడం కదిలించిన అంశం. ప్రజాస్వామ్యంలో రాజకీయ బాధ్యత అత్యంత కీలకం. ఒక శాఖ పరిధిలో పదేపదే వైఫల్యాలు జరుగుతున్నప్పుడు సంబంధిత మంత్రి నైతిక బాధ్యత వహించాలి. ఇదే కారణంతో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది. ప్రశ్నాపత్రాల లీకేజీలు వరుసగా జరుగుతుంటే, పరీక్షల విశ్వసనీయత దెబ్బతింటుంటే, విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే కేవలం విచారణలతో సరిపోదు. వైఫల్యానికి కేంద్రమే బాధ్యత వహించాలి. అందుకే "మేక్ ఇన్ ఇండియా అడిగితే లీక్ ఇన్ ఇండియా ఇచ్చారు" అనే నినాదం అక్కడ మార్మోగింది. దేశంలోని యువత ఉద్యోగాలు కోరుతోంది, న్యాయమైన పరీక్షలు కోరుతోంది, భవిష్యత్తుపై భరోసా కోరుతోంది. కానీ వారికి లభిస్తున్నది నిరు ద్యోగం, లీకేజీలు, అనిశ్చితి మాత్రమే. పరీక్ష? నిర్వహణలో ఫెయిలైన జాతీయ పరీక్ష? సంస్థ (ఎన్‌టిఎ)పై స్వతంత్ర విచారణ జరగాలి. బాధ్యులపై కఠిన చర్య లుండాలి. నీట్ లీకేజీ ఘటనను ఒక సాధారణ సమస్యగా కాకుండా దేశ విద్యా వ్యవస్థకు వచ్చిన హెచ్చరికగా చూడాలి. విద్యార్థుల కన్నీళ్లకు, తల్లిదండ్రుల వేదనకు, నిరుద్యోగ యువత ఆగ్రహానికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే

## కంఠ తిరుపతి రెడ్డి జన్మదిన వేడుకలకు
# కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలి







**రామాయంపేట జూన్ 9 (మహా ప్రభ )**
జనహృదయనేత కంట తిరుపతిరెడ్డి గారి ( బిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి గారి జన్మదిన పురస్కరించుకొని నేడు ( బుధవారం) రామాయంపేట మెదక్ చౌరస్తా నుండి ఉదయం 8: గంటలకు పట్టణ మహంకాళి దేవాలయం కు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుంది అనంతరం 8:30 గం: స్థానిక పట్టణ మహంకాళి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుంది. అనంతరం 8;30 గంటలకు పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం జరుగుతుంది. కావున పట్టణ టిఆర్ఎస్ . మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్. బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసిన అనంతరం రామాయంపేట నుండి ఏడుపాయల కు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని రామాయంపేట మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, సీనియర్ నాయకులు కార్యకర్తలు తెలిపారు.

## జూన్ 10న బి ఎల్ ఏ-2 సభ్యుల శిక్షణా తరగతులు నిర్వహణ



**కరీంనగర్, జూన్ 9 (మహా ప్రభ )**
కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఏ-2 సభ్యుల కోసం శిక్షణా తరగతులు జూన్ 10న ఉదయం 10 గంటలకు కెమిస్ట్రీ భవన్‌లో జరుగనున్నాయి. ఈ శిక్షణలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, బి ఎల్ ఏ-2 సభ్యుల విధులు, బాధ్యతలు, ఓటర్ల జాబితా పరిశీలన, ఫారం-6, ఫారం-7, ఫారం-8లకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించనున్నారు. అన్ని డివిజన్ల బి ఎల్ ఏ-2 సభ్యులు తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు నమిండ్ల శ్రీనివాస్ పరిశీలకుడిగా హాజరుకానున్నారు. జూన్ 10న బి ఎల్ ఏ-2 సభ్యుల శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది.

## ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛ పాఠశాల కార్యక్రమం నిర్వహణ



**కరీంనగర్, జూన్ 9 (మహా ప్రభ )**
కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా వినూత్న కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. జూన్ 15న పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, జూన్ 13న పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో గల అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛ పాఠశాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా క్లాస్‌రూమ్‌ల శుభ్రత, సుందరీకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల టెన్త్ విద్యార్థులకు 'మోదీ గిఫ్ట్' కింద ఉచితంగా బ్రాండెడ్ సైకిళ్లు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈసారి ఒకే సమయంలో వేలాది సైకిళ్లను పంపిణీ చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. మోదీ పాలన 12 ఏళ్ల పూర్తి సందర్భంగా బుధవారం ఉదయం కరీంనగర్ మహాశక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 13న స్వచ్ఛ పాఠశాల కార్యక్రమం, టెన్త్ విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ జరగనుంది.

## పలు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసిన వ్యవసాయ అధికారులు



**హుస్నాబాద్, జూన్ 9 (మహా ప్రభ )**
మండల వ్యవసాయ అధికారి వేల్పుల పూజ, ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి ఆకస్మికంగా పలు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీలర్లకు నాణ్యమైన సన్నరక వడ్ల విత్తనాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయించినా లేదా అధిక ధరలకు అమ్మినా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసే ప్రతి వస్తువుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని, ప్రతి షాపులో స్టాక్ బోర్డులు స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే డీలర్లపై లైసెన్సులు రద్దు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

## వైద్యులకు భద్రత కల్పించాలని ఐఎంఏ డిమాండ్




**కరీంనగర్,జూన్ 9 (మహా ప్రభ )**
ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ బి.ఎన్.రావుపై జరిగిన దాడి యత్నాన్ని ఐఎంఏ, తెలంగాణ ప్రైవేటు నర్సింగ్ హోంల సంఘం తీవ్రంగా ఖండించాయి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని వైద్యులకు తగిన రక్షణ కల్పించాలని ప్రభుత్వం, పోలీసులను వారు కోరారు. ఈ సమస్యపై ఐఎంఏ ఒక యాక్షన్ కమిటీని ఏర్పాటు చేసి, కరీంనగర్ సీపీ గౌష్ ఆలంకు వినతిపత్రం అందజేసినట్లు ప్రతినిధులు తెలిపారు. వైద్యుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని ఐఎంఏ పట్టుదలగా డిమాండ్ చేసింది.

## సాంకేతికత వినియోగం, భద్రతా ప్రమాణాల
# అమలుపై సీపీ గౌష్ ఆలం కీలక ఆదేశాలు

**కరీంనగర్, జూన్ 9 (మహా ప్రభ )**
వార్షిక తనిఖీల్లో భాగంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మంగళవారం హుజురాబాద్ ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించారు. సాయుధ బలగాలు గౌరవ వందనం సమర్పించగా, ఆయన కార్యాలయ ప్రాంగణంలో మొక్కను నాటారు. అనంతరం పెండింగ్ కేసులు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. సీపీ మాట్లాడుతూ జూన్ 15లోగా సీసీటీఎన్ఎస్ 2.0, ఈ-సాక్ష్య యాప్‌లలో కేసుల వివరాలను తప్పనిసరిగా పొందుపరచాలని ఆదేశించారు. నగల దుకాణాలు, బ్యాంకులు, లాడ్జీలలో భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టం చేయాలని, లోపాలు ఉన్న యాజమాన్యాలకు ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. వలస కార్మికుల వివరాలు, పాత నేరస్థులపై నిఘా, కార్డన్ అండ్ సెర్చ్ తనిఖీలు ముమ్మరం చేస్తున్నామని పేర్కొన్నారు.



మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రత్యేక పోలీస్ డాగ్స్ సహాయంతో తనిఖీలు నిర్వహిస్తున్నామని, పట్టుబడినవారిపై ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళల రక్షణ కోసం షీ టీమ్స్, స్నేహిత కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నామని, నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలను పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. హుజురాబాద్ సబ్ డివిజన్ పోలీసుల పనితీరుపై సంతోషం వ్యక్తం చేస్తూ భేష్ అని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ మాధవి, ఇన్స్పెక్టర్లు కరుణాకర్, రామకృష్ణ, వెంకట్, శ్రీనివాస్, ఎస్సైలు స్వాతి, ఆవుల తిరుపతి, ఇతర అధికారులు పాల్గొన్నారు. సాంకేతికత వినియోగం, భద్రతా ప్రమాణాల అమలు, నేరాల నియంత్రణపై సీపీ గౌష్ ఆలం కీలక ఆదేశాలు జారీ చేశారు.

# విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి.

-ఏ ఐ యస్ ఎఫ్ మెదక్ జిల్లా కార్యదర్శి దినకర్.



**మెదక్ జిల్లా -09జూన్ (మహాప్రభ ).**
మెదక్ జిల్లా కేంద్రం లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏ ఐ యస్ ఎఫ్ మెదక్ జిల్లా కార్యదర్శి దినకర్ మాట్లాడుతూ, ఈ నెల 15న పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టం (ఆర్ టి ఇ )ను అనేక ప్రైవేట్ పాఠశాలలు ఉల్లంఘిస్తూ, విద్యాసంస్థలుగా కాకుండా వ్యాపార కేంద్రాలుగా మారాయని విమర్శించారు. విద్యార్థులు తప్పనిసరిగా పాఠశాలల నుంచే పుస్తకాలు, యూనిఫాంలు కొనుగోలు చేయాలని ఒత్తిడి తెచ్చి, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నారని అన్నారు. అలాగే, సంబంధిత అధికారుల అనుమతులు లేకుండా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా పాఠశాల బస్సులకు అవసరమైన ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, నాణ్యమైన విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని హెచ్చరించారు. విద్యను వ్యాపారంగా మార్చే విధానాలను అరికట్టి, విద్యార్థుల హక్కులనుకాపాడాలని ఈ సందర్భంగా ఏ ఐ యస్ ఎఫ్ తరఫున విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పాపయ్యా , తదితరులు పాల్గొన్నారు.

# 95 శాతం ధాన్యం కొనుగోలు పూర్తి.

-జిల్లా వ్యాప్తంగా 84,531 మంది రైతుల నుంచి 3,85,122.080 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు

-66,900 మంది రైతులకు 708,04 కోట్ల రూపాయలు చెల్లింపులు

-జిల్లా వ్యాప్తంగా 311 కొనుగోలు కేంద్రాలు మూసివేత.

-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్




**మెదక్ జిల్లా -08జూన్ (మహాప్రభ ).**
జిల్లాలో 95 శాతం ధాన్యం కొనుగోలు పూర్తి అయినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా 84,531 మంది రైతుల నుంచి 3,85,122.080 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి,66,900 మంది రైతులకు 708,04 కోట్ల రూపాయలు చెల్లింపు జరిపమన్నారు. జిల్లా వ్యాప్తంగా 311 కొనుగోలు కేంద్రాలు మూసివేశామన్నారు. రైతులు అకాల వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని , రైతులు అధైర్య పడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుందని మంగళవారం ఒక ప్రకటన తెలిపారు.

# దేవరకొండ సీఐ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఐపీఎస్



**దేవరకొండ డివిజన్.**
**జూన్ 09 ( మహాప్రభ )**
నల్లగొండ జిల్లా పోలీసు శాఖలో పరిపాలనా పనితీరు, కేసుల దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ దేవరకొండ సీఐ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రేవ్ కేసుల క్రైమ్ ఫైల్స్, పెండింగ్ కేసుల రికార్డులు, ఇతర దర్యాప్తు సంబంధిత ఫైల్స్‌ను సవివరంగా పరిశీలించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు అలాగే హత్యలు, దోపిడీలు, మహిళలు మరియు చిన్నారులపై నేరాలు, సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల దర్యాప్తు పురోగతిపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ కేసులను త్వరితగతిన ఛేదించాలని, ప్రతి కేసులో పటిష్టమైన ఆధారాలు సేకరించి నిందితులకు చట్టపరమైన శిక్షలు పడేలా నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు సీసీటీఎన్ఎస్ నమోదు విధానం, డిజిటల్ రికార్డుల నిర్వహణ, కోర్టు డిస్పోజల్ కేసుల ఫాలోఅప్, వారెంట్ల అమలు తదితర అంశాలపై కూడా ఎస్పీ సమీక్ష నిర్వహించారు. ప్రజలకు పోలీసు శాఖపై మరింత నమ్మకం పెరిగేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో డిఎస్పీ శ్రీనివాసరావు, సీఐ వెంకట్ రెడ్డి, ఇతర పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# రామాయంపేటలో బైకుల ఢీ దంపతులకు గాయాలు



**రామాయంపేట జూన్ 9 మహాప్రభ**
రామాయంపేట మండల కేంద్రంలో సిద్దిపేట రోడ్లో సీతయ్య గుడి వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. సిద్దిపేట వైపు నుండి అతివేగంగా వచ్చిన ఒక ద్విచక్ర వాహనం మరో ద్విచక్రవాహా నానికి ఢీ కొట్టింది . ఈ ప్రమాదం లో రామాయంపేటకు చెందిన రేషన్ డీలర్ కటికే కిషన్. ఉమాబాయి దంపతులకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి 108 సాయంతో వారిని రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు

# మియాపూర్‌లో భారీ అభివృద్ధి ర్యాలీ

జగదీశ్వర్ గౌడ్ నాయకత్వంలో ఉత్సాహంగా పాల్గొన్న యలమంచి ఉదయ్ కిరణ్, కార్యకర్తలు




**శేరిలింగంపల్లి , జూన్ 9 (మహా ప్రభ )**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మియాపూర్ చౌరస్తా వద్ద నిర్వహించిన మహా బహిరంగ సభకు ముందు శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్ గౌడ్ నాయకత్వంలో భారీ అభివృద్ధి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మియాపూర్ డివిజన్ జనరల్ సెక్రటరీ, కాంగ్రెస్ నాయకుడు యలమంచి ఉదయ్ కిరణ్ తన టీమ్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. ఆల్విన్ క్రాస్ రోడ్స్‌లోని విజేత నుంచి సభా ప్రాంగణం వరకు సాగిన ర్యాలీలో కార్యకర్తలు అభివృద్ధి సందేశాలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రజలను ఆకట్టుకున్నారు. ర్యాలీ ప్రజల ఆకాంక్షలకు, శేరిలింగంపల్లి అభివృద్ధిపై ఉన్న విశ్వాసానికి ప్రతీకగా నిలిచిందని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన సుమారు రూ.2,000 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన జరగడం విశేషంగా నిలిచింది. మియాపూర్ ఫ్లైఓవర్, లింగంపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జ్ (ఆర్‌వోబీ), గచ్చిబౌలి ఐఐటీ జంక్షన్ ఫ్లైఓవర్, ఖాజాగూడ జంక్షన్ ఫ్లైఓవర్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, కోర్ అర్బన్ స్కూల్స్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు నియోజకవర్గ అభివృద్ధికి దోహదపడనున్నాయని తెలిపారు. ప్రజా సంక్షేమం, నాణ్యమైన విద్య, ఆధునిక మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతోందని నాయకులు పేర్కొన్నారు.
కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ మహా అభివృద్ధి సభ, ర్యాలీ శేరిలింగంపల్లి అభివృద్ధి చరిత్రలో మరో మైలురాయిగా నిలుస్తుందని వారు అభిప్రాయపడ్డారు.

# మోహన్ నగర్ ప్రజా నివాస్ ఫేజ్1లో నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం





- మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్.



**కొత్తపేట 9 జూన్ (మహాప్రభ)**
కొత్తపేట డివిజన్ పరిధిలోని మోహన్ నగర్ ప్రజా నివాస్ ఫేజ్ 1 కాలనీలో మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నివాసితులు తమ ప్రాంతంలో నెలకొన్న పలు మౌలిక సదుపాయాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా కాలనీలో తీవ్రమైన నీటి కొరత నెలకొన్నందున ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ, తక్షణమే బోర్‌వెల్ ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాల కొరత, పారిశుద్ధ్య నిర్వహణ లోపాలు తదితర అంశాలను కూడా స్థానికులు వివరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న నాయకోటి పవన్ కుమార్ స్పందిస్తూ, గౌరవ పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ సహకారంతో కాలనీలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేలా బోర్‌వెల్ ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.
అలాగే డ్రైనేజీ, స్ట్రీట్ లైట్స్ మరియు ఇతర మౌలిక వసతుల సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రజలకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడానికి ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా నివాస్ ఫేజ్ 1 అసోసియేషన్ అధ్యక్షుడు రామారావు, జనరల్ సెక్రటరీ లింగేశ్వర్, శివ, సుధాకర్, రమణ, కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నివాసితులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సర్ విధానంలో బూత్ లెవెల్ ఏజెంట్లు కీలక పాత్ర పోషించాలి

-దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.





**దేవరకొండ జూన్ 9( మహాప్రభ)**
దేవరకొండ నియోజకవర్గం బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్
ఓటు మన హక్కు దానిని కాపాడమే బిఎల్ ఎ భాద్యతబిబినేనావత్ బాలు నాయక్ బిజెపి కేంద్ర ప్రభుత్వం కాంగ్రెస్ సానుభూతి ఓట్లను తొలగించే కుట్ర చేస్తుంది. దేశంలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలన్నా.., రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నా మరియు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నా బూత్ లెవెల్ ఏజెంట్లు ( బివిల్ ఎ) మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు లెవెల్ అధికారి (బిఎల్ బ) కలిసి మన ఓట్లు ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత మీదే.. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 326 బూత్ లు ఉన్నాయి. ప్రతి పది బుత్ లకు ఒక ఇన్చార్జిగా ఉంటారు
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ( సర్) కార్యక్రమంలో బూత్ లెవెల్ ఏజెంట్లు (బిఎల్ఏలు) అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా బూత్ లెవెల్ ఏజెంట్లు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా యువత, మహిళలు, గిరిజనులు, దళితులు, మైనారిటీలు మరియు ఇతర వెనుకబడిన వర్గాల ప్రజలు ఓటర్ల జాబితాలో నమోదు కావడానికి సహకరించాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎవరైనా అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఇంటికి చేరుకొని ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అవసరమైన పత్రాలు సమర్పించడంలో ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. బూత్ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల ఓటు హక్కును పరిరక్షించేందుకు కట్టుబడి ఉండాలి ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి కార్యకర్త తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ పార్లమెంటు సర్ఇంచార్జ్ ఎమ్మెల్సీ మరియు ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ , దేవరకొండ అసెంబ్లీ ఇంచార్జ్ ప్రతాప్ రెడ్డి , రాష్ట్ర వడ్డెర సంఘం చైర్మన్ గుంజ రేణుక నారాయణ , కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, బూత్ లెవెల్ ఏజెంట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రామాయంపేట మున్సిపాలిటీ వార్డులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

**రామాయంపేట జూన్ 9 మహాప్రభ**
రామాయంపేట మున్సిపాలిటీ 9వ వార్డుల సభలో నీ సమస్యలను స్వయంగా గౌరవనీయులైన కమిషనర్ గారు మరియు వార్డ్ కౌన్సిలర్ దేవుని రంజిత్ గారు శానిటేషన్ ఇన్స్పెక్టర్ గారు. వార్డులు తిరుగుతూ వాటిని పరిష్కరించే దిశగా చేస్తున్నారు . వర్షం కారణంగా నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు అలాగే ఇంటి పక్కన పరిశుభ్రలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు



# ఎఫ్ ఎల్ ఎన్ అమలులో ఎం ఈ ఓ లు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలదే కీలక పాత్ర

## -జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ జిల్లా -08జూన్ (మహాప్రభ ).**

సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాలో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ ఫలితాల మెరుగుదలకు (2026--27) విద్యా సంవత్సరానికి జిల్లా వార్షిక ప్రణాళికా వర్క్ షాప్ నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రాజు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్ మూర్తి, ఏ. సి. జి .ఈ. కరుణాకర్, సీఎం ఓ రాజు, ఏ ఎస్ ఓ నవీన్ , మండల విద్యాశాఖ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల రిసోర్స్ పర్సన్స్, తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ మాట్లాడుతూ విద్యార్థులకు నిర్వహించిన బేస్ లైన్ అసెస్మెంట్ ఫలితాల ఆధారంగా విద్యార్థుల అభ్యసన సమార్థ్యాన్ని గుర్తించి రాబోయే డిసెంబర్ నాటికి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచాలని సూచించారు. అదే విధంగా మండల సమీక్ష సమావేశాల నిర్వహణ, కృత్రిమ మేధ ఆధారిత అభ్యసనాన్ని మెరుగుపర్చాలన్నారు. పాఠశాలలో విద్యార్థులు కనీస సామర్థ్యాలు సాధించేలా ఎంఈఓలు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలను ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు నిబంధనల మేరకు ఖచ్చితంగా తనిఖీ చేయాలని, ఉపాధ్యాయులు పాఠశాలల్లో పనితీరు, తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహణ చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మకమైన విద్యను అందించాలని . అన్నారు.ప్రాథమిక విద్యాభివృద్ధికి ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరాసి (ఎఫ్ఎల్ఎన్) అత్యంత కీలకం. అని తెలిపారు. వార్షిక ఎఫ్ఎల్ఎన్ మూల్యాంకన ఫలితాలు, ఉపాధ్యాయుల అంచనా వివరాలు, జిల్లాలోని అభ్యాస ధోరణులను సమీక్షించి, రాబోయే విద్యా సంవత్సరానికి సబ్జెక్ట్వారీ లక్ష్యాలను ఖరారు చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థుల అభ్యాస పురోగతి పర్యవేక్షణ, స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల బలోపేతం, సహాయక పర్యవేక్షణ వ్యవస్థలు, సమీక్షా విధానాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. అలాగే పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్ సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు, చేపడుతున్నట్టు చెప్పారు.ఉపాధ్యాయులు, మెంటర్ల సామర్థ్యాభివృద్ధి, ప్రోత్సాహక వ్యవస్థలపై చర్చించడం జరిగింది అన్నారు. జిల్లా స్థాయి ప్రాధాన్యతలు, కాలపట్టికలు, బాధ్యతలు, జవాబుదారీతన వ్యవస్థలను ఖరారు చేస్తూ ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాల సాధనకు సంయుక్త కార్యాచరణ ప్రణాళికను ఆమోదించడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల రిసోర్స్ పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కేరాఫ్ అడ్రస్ ప్రభుత్వ పాఠశాలలు.

**-విద్య రంగం లో జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి.**

**-విద్యార్థులు ఐ.ఐ.ఐ.టి వైపే కాకుండా దేశంలో ఉన్నత విద్యా సంస్థలైన ఎయిమ్స్ లాంటి ఉత్తమమైన వైద్య కళాశాలలో ప్రవేశాలు పొందడానికి ప్రయత్నించాలి కలెక్టర్.**



**మెదక్ జిల్లా -08జూన్ -(మహాప్రభ )**

జిల్లా వ్యాప్తంగా 100 శాతం ఉత్తీర్ణత సాధించిన 91 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు , సన్మానాలు. S.S.C లో 560 ఆ పై మార్కులు సాధించిన ఉత్తమ ప్రతిభావంతులైన విద్యార్థులకు సన్మాన సత్కార ప్రశంసలు అని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు విద్య రంగం లో మెదక్ జిల్లా ను మొదటి స్థానంలో నిలపాలనీ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని మీటింగ్ హాల్లో గత సం: పదవ తరగతిలో ఎక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులను సన్మానించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. విద్యారంగంలో జిల్లా ఉన్నత స్థానంలో ఉండాలని సూచించారు. సమాజంలో వ్యక్తి నీ ఉన్నతమైన స్థాయిలో నిలపాలంటే విద్య ద్వారానే సాధ్యం అయితుందన్నారు . విద్యార్థులు ఐ.ఐ.ఐ.టి వైపే కాకుండా దేశంలో ఉన్నత విద్యా సంస్థలైన ఐఐటి లలో స్థానాన్ని పొందడానికి, ఎయిమ్స్ లాంటి ఉత్తమమైన వైద్య కళాశాలలో ప్రవేశాలు పొందడానికి ప్రయత్నించాలన్నారు. విద్యార్థులు ఉన్నతమైన శిఖరాలు అధిరోహించి భవిష్యత్తులో మంచిస్థాయి లో ఉండాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా 100 శాతం ఉత్తీర్ణత సాధించిన 91 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, 560 ఆపై మార్కులు పొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాన్ని, ఎగ్జిక్యూటివ్ ఫైల్ , డిక్షనరీ మరియు పెన్స్ ని అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు, ఏ ఎం ఓ సుదర్శన మూర్తి, కరుణాకర్, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి రాజు , సహాయ గణాంక అధికారి నవీన్ , ఎంఈఓ లు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఎమ్మార్పీలు , విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్లో ఎస్పీ వార్షిక తనిఖీ

**-రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసులపై సమగ్ర సమీక్ష.**

**-రౌడీషీటర్లు, సస్పెక్ట్లపై నిరంతర నిఘా కొనసాగించాలి**

**-మెదక్ జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్**



**మెదక్ జిల్లా -08జూన్ (మహాప్రభ ).**

మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్లో వార్షిక తనిఖీలలో భాగంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్లోని పరిపాలన, నేరాల దర్యాప్తు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును సమగ్రంగా పరిశీలించారు. ఎఫ్ఐఆర్ల నమోదు విధానం, స్టేషన్ డైరీలు, పెండింగ్ కేసుల పురోగతి, రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు, బీట్ బుక్స్, సీజ్ ప్రాపర్టీ రికార్డులు, వారెంట్ల అమలు, సీసీటీఎన్ఎస్ నమోదు విధానం తదితర అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలాగే పోలీస్ స్టేషన్ సిబ్బందికి కేటాయించిన సామగ్రి, సర్వీస్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లో ఎలాంటి పెండెన్సీ లేకుండా రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఉండాలని సూచించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని, ప్రతి దశలో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని ఆదేశించారు. నిష్పక్షపాత విధుల ద్వారానే ప్రజల విశ్వాసాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను ఓర్పుతో విని చట్టపరమైన సహాయం అందించాలని సిబ్బందికి సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిరోజూ వాహన తనిఖీలు నిర్వహించాలని, ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది క్రమశిక్షణ వంటి అంశాలపై కూడా ఎస్పీ సంతృప్తి వ్యక్తం చేస్తూనే మరింత మెరుగైన పనితీరు కనబర్చాలని సూచించారు. అలాగే రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్లలో ఉన్న వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలని, వారి కదలికలు, ప్రవర్తనను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వారి ప్రస్తుత స్థితిగతులను తెలుసుకోవాలని సిబ్బందికి సూచించారు. నేరాల నియంత్రణలో బీట్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించిన ఎస్పీ, వారి విధుల నిర్వహణకు సంబంధించిన అంశాలతో పాటు వ్యక్తిగత సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీస్ శాఖ ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొంటూ, వ్యక్తిగత ఇబ్బందులు ఉన్న వారు ప్రతి శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో తనను నేరుగా కలవవచ్చని తెలిపారు. దీంతో సిబ్బంది సమస్యలను స్వేచ్ఛగా తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు జార్జ్, సందీప్ రెడ్డి, ఎస్ఐ లింగం తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్ హెడ్క్వార్టర్స్లో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్ తనిఖీలు..



**మెదక్ జిల్లా -08జూన్ (మహాప్రభ ).**

జిల్లా పోలీస్ హెడ్క్వార్టర్స్లోని వివిధ విభాగాలను మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బెల్ ఆఫ్ ఆర్మ్స్, ఆర్ఐ స్టోర్స్, డ్యూటీ ఆఫీసర్ విభాగాలను సందర్శించి అక్కడి పనితీరు, రికార్డుల నిర్వహణ, భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. ముందుగా బెల్ ఆఫ్ ఆర్మ్స్ను తనిఖీ చేసిన అదనపు ఎస్పీ, ఆయుధాల భద్రత, నిర్వహణ విధానాలు, ఆయుధాల జారీ మరియు స్వీకరణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆయుధాల నిర్వహణలో నిర్దేశిత నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, ఎలాంటి లోపాలకు తావు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆర్ఐ స్టోర్స్ను తనిఖీ చేసి పోలీసు శాఖకు సంబంధించిన సామగ్రి నిల్వలు, వాటి సంరక్షణ, పంపిణీ విధానాలను పరిశీలించారు. స్టోర్స్లోని వస్తువుల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని, అవసరమైన సామగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తదుపరి డ్యూటీ ఆఫీసర్ విభాగాన్ని తనిఖీ చేసిన ఆయన, విధుల నిర్వహణ, రిజిస్టర్ల నిర్వహణ, సమాచార నమోదు విధానాలను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, అధికారిక రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీసు శాఖలో క్రమశిక్షణ, పారదర్శకత, బాధ్యతాయుతమైన విధుల నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తెలిపారు. తనిఖీలలో ఆర్ఐ శైలందర్, ఆర్ఎస్సై నరేష్, హరీష్ రెడ్డి, మహిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

# గో టు విలేజ్ 40 రోజుల కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



**దేవరకొండ జూన్ 9 ( మహాప్రభ )**

ఎమ్మార్పీఎస్, దేవరకొండ నియోజకవర్గం ఇన్చార్జి బొజ్జ చిన్న మాదిగ ఎం ఆర్ పి ఎస్. వ్యవస్థాపకులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు మంగళవారం దేవరకొండ మండలం పరిధిలో మైనంపల్లి గ్రామంలో ఎం ఆర్ పి ఎస్ , సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవరకొండ నియోజకవర్గ ఇన్చార్జి బొజ్జ చిన్న మాదిగ పాల్గొని మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సాధించుకున్న ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఫలాలను గ్రామాలలో చదువుకున్న విద్యార్థులు, నిరుద్యోగులు ఉపయోగించుకొని ఉద్యోగాలు సాధించేలా చైతన్య పరచడంతో పాటు, జాతి ఆత్మగౌరవ పతాకమైన ఎమ్మార్పీఎస్ దిమ్మెలను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసుకొని, జూలై 7న జరిగే ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గ్రామ గ్రామాన పెద్ద ఎత్తున పండగ వాతావరణం లో చేపట్టాలని తెలియజేస్తూ మే 25 నుండి జులై 5 వరకు జరిగే గో టు విలేజ్ 40 రోజుల కార్యక్రమం సందర్భంగా ప్రతి గ్రామాలలో జాతిని సంఘటితం చేస్తూ ప్రచారాలలో పాల్గొని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ముందుకు కొనసాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చందంపేట మండలం ఇన్చార్జి మాతంగి కాశయ్య మాదిగ. ఎమ్మార్పీఎస్ నాయకులు మైనంపల్లి గ్రామ అధ్యక్షులు. పులిజాల మల్లేష్ మాదిగ. పులిజాల సాలయ్య మాదిగ పులిజాల లాలయ మాదిగ.పులిజాల వెంకటయ్య మాదిగ. పులిజాల ఎల్లయ్య మాదిగ వెంకటయ్య మాదిగ ఎల్లయ్య మాదిగ. ముత్యాలు. పులిజాల కిరణ్ పులిజాల రాకేష్ నల్ల గణేష్ మాసారం అశోక్ మాదిగలు తదితరులు పాల్గొన్నారు

# నేడు దేవరకొండలో ఎమ్మెల్యే బాలు నాయక్ విస్తృత పర్యటన.. షెడ్యూల్ ఇదే!



**దేవరకొండ జూన్ 9 ( మహాప్రభ )**

ఉదయం 9 గంటలకు వేటు న్యూస్ నిర్వహించే డయల్ యువర్ ఎమ్మెల్యేకార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే నివాసంలో కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల పురోగతి మరియు 2వ విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికపై ఎంపిడిఓ లు మరియు హౌసింగ్ డిపార్ట్మెంట్ అధికారులతో సమావేశం నిర్వహిస్తారు.

ఇట్లు..

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం - దేవరకొండ.

# కార్మిక ప్రయోజనాల కోసం పోరాడే ఏకైక సంఘం ఎంప్లాయిస్ యూనియన్



**మెదక్, జూన్ 9,(మహాప్రభ)**



కార్మికుల హక్కులు, ప్రయోజనాల కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక కార్మిక సంఘం ఎంప్లాయిస్ యూనియన్ (ఈయు) అని తెలంగాణ రాష్ట్ర ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న అన్నారు. మంగళవారం స్థానిక టీఎన్జీవోస్ భవన్లో నిర్వహించిన ఎంప్లాయిస్ యూనియన్ కార్మిక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న సంఘం ఎంప్లాయిస్ యూనియన్ అని పేర్కొన్నారు. కార్మిక సంఘాల ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఎంప్లాయిస్ యూనియన్ గెలిచి గుర్తింపు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల కష్టనష్టాలు కార్మికులకే బాగా తెలుసని, ఉన్నతాధికారులకు వారి వాస్తవ పరిస్థితులు పూర్తిగా అర్థం కావని వ్యాఖ్యానించారు. జేఏసీ ఆధ్వర్యంలో కార్మికుల హక్కుల కోసం చేపట్టిన పోరాటాలను ఈ సందర్భంగా వివరించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎంప్లాయిస్ యూనియన్ పూర్వ నాయకుడు సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ, కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మే డే సందర్భంగా కార్మిక జెండా ఆవిష్కరణను ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. కార్మికుల ప్రయోజనాల కోసం అవసరమైన ప్రతి సహకారాన్ని అందించేందుకు తాను సిద్ధంగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమములో ఈయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న మరియు రీజినల్ కార్యదర్శి శేషు, రీజినల్ అధ్యక్షులు లోహితరావు, సిద్దిపేట ఈయు కార్యదర్శి రాజయ్య, పాల్గొన్నారు. మెదక్ డిపో ఈయు అధ్యక్షులుగా ఎన్. కిష్టయ్య, కార్యదర్శిగా బి. సర్వాన్ లను ఎన్నుకున్నారు. ఇంకా బి. అనంతం, ఎం మల్లేశం, షకీల్, కున్య ఇప్ప గోపాల్, బాబూలాల్ మొదలగువారు పాల్గొన్నారు.

# బిజినెస్

## కోలుకున్న సూచీలు.. 390 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్..



సోమవారం భారీ నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు మంగళవారం కోలుకున్నాయి. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ కారణంగా అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గాయి. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ (95.35) బలపడింది. అలాగే బ్యాంకింగ్ సెక్టార్‌లో కొనుగోళ్లు సూచీలను ముందుకు నడిపాయి. ఈ నేపథ్యంలో సెన్సెక్స్, నిఫ్టీ లాభాలతో రోజును ముగించాయిగత సెషన్ ముగింపు (73,524)తో పోల్చుకుంటే మంగళవారం ఉదయం దాదాపు 500 పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత ఒడిదుడుకులు ఎదుర్కొంది. మధ్యాహ్నం సమయంలో నష్టాల్లోకి జారుకుంది. అయితే చివరి గంటలో కొనుగోళ్ల మద్దతు లభించింది. చివరకు సెన్సెక్స్ 394 పాయింట్ల లాభంతో 73,918 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 119 పాయింట్ల లాభంతో 23,242 వద్ద స్థిరపడింది . సెన్సెక్స్, నిఫ్టీలో పీఐ ఇండస్ట్రీస్, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, మోతీలాల్ ఓస్వాల్, ఆర్బీఎల్ బ్యాంక్ మొదలైన షేర్లు లాభాలు ఆర్జించాయి (ంష్త్రుతీవ ఝతీఎవ్ అవషం). ఓఎన్‌జీసీ, టైటాన్ కంపెనీ, ఎన్‌టీపీసీ, వొడాఫోన్ ఐడియా, ఇన్ఫోఎడ్జ్ మొదలైన షేర్లు నష్టాలు మూటగట్టుకున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 1130 పాయింట్లు లాభపడింది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 809 పాయింట్లు ఆర్జించింది.

## మరింత తగ్గిన గోల్డ్, సిల్వర్ రేట్స్!

### కొనాలనుకుంటే మంచి ఛాన్స్



బంగారం, వెండి కొనాలనుకునేవారికి శుభవార్త.. ధరలు వరుసగా తగ్గుతూ వస్తున్నాయి. గత కొన్ని రోజులుగా స్వల్పంగా తగ్గిన బంగారం, వెండి ధరలు ఇప్పుడు మరింత తగ్గాయి. హైదరాబాద్‌లో ఎ (మంగళవారం, జూన్ 9) బంగారం, వెండి ధరలు పెట్టుబడిదారులు, వినియోగదారుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. తాజా మార్కెట్ వివరాల ప్రకారం.. 24 క్యారెట్ల (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర గ్రాముకు రూ.15,168గా నమోదైంది. అలాగే 22 క్యారెట్ల (91.6 శాతం స్వచ్ఛత) బంగారం ధర గ్రాముకు రూ.13,904గా ఉండగా, 18 క్యారెట్ల (75 శాతం స్వచ్ఛత) బంగారం ధర గ్రాముకు రూ.11,376గా ఉంది.హైదరాబాద్‌లో బంగారం ధరలు ప్రధానంగా అంతర్జాతీయ మార్కెట్లలో జరిగే మార్పులను అనుసరిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణ పరిస్థితులు, బంగారం అంతర్జాతీయ ధరల్లో హెచ్చుతగ్గులు, వివిధ దేశాల సెంట్రల్ బ్యాంకులు నిర్వహించే బంగారు నిల్వలు, వడ్డీ రేట్ల మార్పులు, ఆభరణాల రంగంలో డిమాండ్ వంటి అంశాలు బంగారం ధరలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయి.

ఇక వెండి విషయానికి వస్తే, హైదరాబాద్‌లో నేడు వెండి ధర గ్రాముకు రూ.269.90గా, కిలోగ్రాముకు రూ.2,69,900గా నమోదైంది. నగరంలో వెండి కొనుగోలు, అమ్మకాల కోసం అనేక వ్యాపార సంస్థలు అందుబాటులో ఉన్నాయి. వ్యాపారులు, పెట్టుబడిదారులకు వెండి కూడా దీర్ఘకాలిక పెట్టుబడి సాధనంగా ఉపయోగపడుతుందని మార్కెట్ వర్గాలు సూచిస్తున్నాయి. భౌతిక రూపంలో వెండిని కొనుగోలు చేయడమే కాకుండా, మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (వీజశ) ద్వారా కూడా పెట్టుబడులు పెట్టే అవకాశాలు ఉన్నాయి. మన దేశంలో బంగారం ధరలను ప్రభావితం చేసే ప్రధాన అంశాల్లో అంతర్జాతీయ బంగారం ధరలతో పాటు డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ, కేంద్ర ప్రభుత్వం విధించే దిగుమతి సుంకాలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి.

## బీఎండబ్ల్యూ కార్లు ప్రియం

**ముంబై,**
జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ మరోసారి ధరలను పెంచబోతున్నట్టు ప్రకటించింది. జూలై 1 నుంచి అమల్లోకి వచ్చేలా అన్ని రకాల మాడళ్ల ధరలను 2 శాతం వరకు సవరిస్తున్నట్టు వెల్లడించింది. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో బీఎండబ్ల్యూ, మినీ వాహనాలు మరింత ప్రియంకాబోతున్నాయి.ఈ సందర్భంగా బీఎండబ్ల్యూ గ్రూపు ఇండియా ప్రెసిడెంట్, సీఈవో హర్దీప్ సింగ్ బ్రార్ మాట్లాడుతూ..రూపాయి పతనం చెందడంతోపాటు లాజిస్టిక్స్ కోసం అధికంగా ఖర్చు చేయాల్సి వస్తుండటంతో సంస్థపై పడుతున్న అదనపు భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా ధరలను సవరించాల్సి వచ్చిందని పేర్కొన్నారు.



# స్పోర్ట్స్

## యువ భారత్ బోణీ

### గైక్వాడ్ సెంచరీ

**దంబుల్లా**
ముక్కోణపు వన్డే సిరీస్‌లో యువ భారత్ అదిరిపోయే బోణీ కొట్టింది. హైదరాబాదీ తిలక్‌వర్మ కెప్టెన్సీలో బరిలోకి దిగిన భారత్-ఎ మంగళవారం ఉత్కంఠగా సాగిన తొలి పోరులో 8 పరుగుల తేడాతో ఆతిథ్య శ్రీలంకపై అద్భుత విజయం సాధించింది. తొలుత వైస్ కెప్టెన్ రుతరాజ్ గైక్వాడ్(114 బంతుల్లో 6ఫోర్లు, 3 సిక్స్‌లతో 101) సెంచరీకి తోడు కెప్టెన్ తిలక్ ( 60) అర్ధసెంచరీతో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 277/6 స్కోరు చేసింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్‌సింగ్(2)తో పాటు ఐపీఎల్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ (14) ఫెయిలవగా.. ప్రియాంశ్ ఆర్య (32) ఫర్వాలేదనిపించాడు.ఓదశలో 69/3తో నిలిచిన జట్టును రుతురాజ్, తిలక్ నాలుగో వికెట్‌కు 150 పరుగులు జోడించి ఆదుకున్నారు. అనంతరం ఛేదనకు దిగిన లంక-ఏ జట్టు 48.5 ఓవర్లలో 269 పరుగులకు ఆలౌటైంది. ఆఖరి 12 బంతుల్లో 10 పరుగులు అవసరమైన దశలో అర్షద్‌ఖాన్ (2/24).. విజయ్‌కాంత్ (5), షిరాజ్ (0)ను ఔట్ చేసి జట్టు విజయంలో కీలకమయ్యాడు. లంక కెప్టెన్ సహాన్ ఆరాచిగె(74) అర్ధ సెంచరీతో ఆకట్టుకున్నాడు. రుతురాజ్‌కు 'ప్లేయర్‌ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. గురువారం జరిగే తర్వాతి మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్‌తో భారత్-ఏ తలపడనుంది.



## సిరాజ్‌కు విశ్రాంతి.. ప్రసిధ్‌కు చోటు





**ముంబై:**
ఐర్లాండ్, ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లకు టీమిండియా స్పీడ్‌స్టర్ మహమ్మద్ సిరాజ్ దూరం అయ్యాడు. భవిష్యత్ సిరీస్‌లను దృష్టిలో పెట్టుకుని సిరాజ్‌కు విశ్రాంతినిచ్చిన బీసీసీఐ..అతని స్థానంలో ప్రసిధ్ కృష్ణను ఎంపిక చేసింది. ఇటీవల ముగిసిన ఐపీఎల్‌తో పాటు అఫ్గానిస్థాన్‌తో ఏకైక టెస్టు మ్యాచ్‌లో సిరాజ్ బరిలో దిగాడు. తన వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌ను పరిశీలించిన బీసీసీఐ మెడికల్ బృందం... టీమ్ మేనేజ్‌మెంట్‌తో చర్చించి ఈ నిర్ణయం తీసుకుంది.ఐర్లాండ్‌తో పాటు ఇంగ్లండ్‌తో సిరీస్‌లకు ఎంపిక చేసిన సెలెక్టర్లు..ఆసియా గేమ్స్‌కు సిరాజ్‌ను పరిగణనలోకి తీసుకోలేదు. చివరిసారి సొంతగడ్డపై జరిగిన టీ20 ప్రపంచకప్‌లో సిరాజ్..భారత్ తరఫున టీ20ల్లో ఆడాడు. ఈ నెల 26, 28న ఐర్లాండ్‌తో రెండు టీ20ల్లో తలపడే భారత్.. వచ్చే నెల 1 నుంచి ఇంగ్లండ్‌తో 5 టీ20 ఆడుతుంది.

## ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఫిట్..

### ఆఫ్ఘన్‌తో వన్డేలకు క్లియరెన్స్

**ముల్లాన్‌పూర్**
టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా .. ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగే వన్డే సిరీస్‌లో ఆడే అవకాశాలు ఉన్నాయి. ఆదివారం నుంచి ఆఫ్ఘనిస్తాన్‌తో మూడు వన్డేలు జరగనున్నాయి. ఫస్ట్ వన్డే ధర్మశాలలో ఆడనున్నారు. అయితే పాండ్యా పూర్తిగా ఫిట్‌గా ఉన్నట్లు బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు చెందిన నిపుణుల బృందం పేర్కొన్నది. పాండ్యాకు ఆ టీమ్ క్లియరెన్స్ ఇచ్చింది. బెంగుళూరులోని సెంటర్‌లో అతను పూర్తి స్థాయిలో 10 ఓవర్లు బౌలింగ్ చేసినట్లు తెలుస్తోంది.ఐపీఎల్ ముంబై ఇండియన్స్ తరపున కెప్టెన్స్ చేపట్టిన పాండ్యా వెన్ను నొప్పి వల్ల కొన్ని మ్యాచ్‌లు ఆడలేదు. దీంతో అతను జూన్ రెండో తేదీ నుంచి బెంగుళూరు సెంటర్‌లో శిక్షణ పొందాడు. కోలుకునే దశలో భాగంగా పాండ్యా 10 ఓవర్లు బౌలింగ్ చేశాడని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతం పాండ్యా ఫిట్‌నెస్ బాగానే ఉందని, అన్ని పారామీటర్స్ సరిగ్గా ఉన్నట్లు సీఈవో కోచ్‌లు తెలిపారు. పాండ్యా ఫిట్‌నెస్ గురించి అప్‌డేట్ తెలియకున్నా, అతను బాగానే ప్రిపేరవుతున్నట్లు తెలిసిందని భారత అసిస్టెంట్ కోచ్ సీతాన్షు కోటక్ తెలిపారు. వైట్‌బాల్ క్రికెట్‌లో పాండ్యా కీలకమైన వ్యక్తిగా మారనున్నాడు. పేస్ బౌలింగ్‌తో పాటు చివరి ఓవర్లలో భారీ షాట్లు ఆడగలడు. ఇక 50 ఓవర్ల వన్డేలో పాండ్యా 10 ఓవర్లు బౌలింగ్ చేయడం చాలా కీలకం కానున్నది. ప్రస్తుతం భారత వన్డే జట్టు చండీఘడ్‌లో శిక్షణ పొందుతోంది. అయితే ఆ టీమ్‌తో పాండ్యా జతకలుస్తాడా లేదా అన్న విషయంపై క్లారిటీ లేదు. ఇక మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ కూడా ప్రస్తుతం బెంగుళూరు సెంటర్‌లోనే ట్రైనింగ్ కొనసాగిస్తున్నాడు.



# విడుదలకు రెడీ అవుతున్న అఖిల్ లెనిన్





అక్కినేని యువ హీరో అఖిల్ నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ అండ్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్ 'లెనిన్'. 'వినరో భాగ్యము విష్ణుకథ' ఫేమ్ మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు మనం ఎంటర్‌ప్రైజెస్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ ఊరమాస్ గ్రామీణ ప్రేమకథా చిత్రం జూన్ 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతోంది. టీజర్, సాంగ్స్ రిలీజ్ అయ్యాక ఈ సినిమాపై ట్రేడ్ వర్గాల్లో అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా ప్రీ-రిలీజ్ థియేట్రికల్ బిజినెస్ సర్కిల్స్‌లో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ బిజినెస్ క్లోజ్ అయినట్లు టాక్. రాయలసీమ మినహాయించి మిగిలిన ఆంధ్ర రీజియన్ థియేట్రికల్ హక్కులు దాదాపు రూ. 9 కోట్ల రేషియోలో క్లోజ్ అయింది. అఖిల్ గత చిత్రం ఏజెంట్ బిగ్గెస్ట్ డిజాస్టరా అయినా కూడా 'లెనిన్' స్జబెక్ట్ మరియు ప్రోమోస్ లోని మాస్ అప్పీల్ చూసి బయ్యర్లు ఈ స్థాయి మొత్తాన్ని పెట్టడానికి ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో అఖిల్ సరికొత్త రఫ్ అండ్ రస్టిక్ లుక్‌లో కనిపిస్తుండగా, ఆయనకు జోడీగా క్రేజీ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే నటిస్తోంది. థమన్ అందిస్తున్న మ్యూజిక్ సినిమాకు పెద్ద ప్లస్ కానుంది. ఈ సినిమాతో అఖిల్ బాక్సాఫీస్ వద్ద సాలిడ్ కంబ్యాక్ ఇవ్వడం ఖాయమని అక్కినేని అభిమానులు నమ్మకంగా ఉన్నారు. ఆంధ్ర ఏరియాలోనే 9 కోట్ల రేషియోలో బిజినెస్ కదా రాయలసీమ మంచి రేట్ వచ్చే అవకాశం ఉంది. ఇక నైజాంలో అన్నపూర్ణ సొంత డిస్ట్రిబ్యూషన్ పైనే రిలీజ్ చేసే అవకాశం ఉంది.



## హెబ్బా... శారీలో అదిరిందబ్బా

# నాని 'ది పారడైజ్' మళ్లీ వాయిదా?

-రవితేజ 'ఇరుముడి' కోసమేనా!




నాచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'ది పారడైజ్' మరోసారి వాయిదా పడే దిశగా కనిపిస్తోంది. మొదట మార్చి 26న విడుదల కావాల్సిన ఈ చిత్రం, ఆ తర్వాత ఆగస్టు 21కి వాయిదా పడిన సంగతి తెలిసిందే. అయితే, ఇప్పుడు ఆ ఆగస్టు 21వ తేదీని మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న 'ఇరుముడి' సినిమా లాక్ చేసుకోవడంతో నాని సినిమా పోస్ట్‌పోన్ కాక తప్పని పరిస్థితి ఏర్పడింది. సినిమాకు సంబంధించిన కొంత వర్క్ ఇంకా పెండింగ్‌లో ఉండటమే ఈ ఆలస్యానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. సోషల్ మీడియాలో వినిపిస్తున్న తాజా సమాచారం ప్రకారం.. 'ది పారడైజ్' చిత్రం సెప్టెంబర్ నెలలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది. అయితే, ఇది కేవలం ప్రచారం మాత్రమేనని, దీనిపై చిత్ర యూనిట్ నుండి అధికారిక ప్రకటన రావాల్సి ఉందని ఇండస్ట్రీ టాక్. బ్లాక్‌బస్టర్ 'దసరా' తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో 'ది పారడైజ్' పై భారీ అంచనాలు ఉన్నాయి. ఎస్ఎల్‌వి సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో కాయాడు లోహర్ హీరోయిన్ గా నటిస్తుండగా, కలెక్షన్ కింగ్ మోహన్ బాబు విలన్ పాత్రలో నటిస్తున్నాడు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని అందిస్తున్నాడు.



# అందంలో అప్సరస..

సాలిడ్ హిట్ కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్న భామ..

కొంతమంది హీరోయిన్స్ సాలిడ్ హిట్ కోసం చాలా కాలంగా ప్రయత్నిస్తున్నారు వరుసగా సినిమాలు చేస్తున్నప్పటికీ సరైన హిట్స్ లేక సతమతం అవుతున్నారు వారిలో ఈ అమ్మడు ఒకరు. ఈ ముద్దుగుమ్మ అందంలో అప్సరస, నటన పరంగానూ మంచి మార్కులు కొట్టేసింది.. కానీ ఆశించిన స్థాయిలో అవకాశాలు మాత్రం అందుకోలేకపోతుంది. దాంతో ఆమె అభిమానులు ఒకింత నిరాశ వ్యక్తం చేస్తున్నారు. తెలుగు అమ్మాయిలకు ఇటీవల సినిమాల్లో మంచి అవకాశాలు దక్కుతున్నాయి. కొందరు స్టార్స్ గానూ మారి సినిమాలు చేస్తూ మెప్పిస్తున్నారు. మరికొంతమంది తమను తాము నిరూపించుకుంటూ దూసుకుపోతున్నారు. ఇక ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న హీరోయిన్ కూడా ఒకొక్క సినిమాకు వేరియేషన్స్ చూపిస్తూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంటుంది. ఆమె ఎవరో కాదు అందాల భామ అనన్య నాగళ్ల. అనన్య నాగళ్ల మల్లేశం అనే సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది. ప్రియదర్శి హీరోగా నటించిన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. దాంతో ఈ చిన్నదానికి మంచి గుర్తింపు వచ్చింది. ఆతర్వాత వరుసగా సినిమాలు చేసి మెప్పించింది. కెరీర్ బిగినింగ్ లో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేసిన ఈ చిన్నది నటనపై మక్కువతో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. ఇప్పుడు హీరోయిన్ గా కంటిన్యూ అవుతుంది. మల్లేశం తర్వాత ప్లే బ్యాక్ అనే సినిమా చేసింది. ఆతర్వాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన వకీల్ సాబ్ లో ఛాన్స్ అందుకుంది. ఈ సినిమాలో తన నటనతో కట్టిపడేసింది అనన్య నాగళ్ల. ఆతర్వాత వరుసగా 9 సినిమాలు చేసింది. కానీ ఆ సినిమాలు పెద్దగా బాక్సాఫీస్ దగ్గర ప్రభావం చూపలేదు. దాంతో ఈ అమ్మడి ఫ్యాన్స్ కాస్త నిరాశ వ్యక్తం చేస్తున్నారు. అందం అభినయం ఉన్న అనన్యకు బడా హీరోల సినిమాల్లో ఛాన్స్ లు రావాలని కోరుకుంటున్నారు. ఇక అనన్య పేరు ఇటీవల వార్తల్లో ఎక్కువగా వినిపించింది.. ఆమధ్య బెట్టింగ్ యాప్ ఇష్యులో .. అలాగే మొన్నామధ్య ఇన్ స్టా సబ్ స్క్రిప్షన్ వార్తల్లో అనన్య పేరు వినిపించింది. కాగా సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ చిన్నది రెగ్యులర్ గా ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. ఈ క్రమంలోనే ఈ చిన్నదాని ఫోటోలు చక్కర్లు కొడుతున్నాయి.

# వైవిధ్యమైన కథతో జంగా



త్రిగుణ్, నేహా పఠాన్, వరలక్ష్మి శరత్‌కుమార్ పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'జంగా'. కెవిన్ గడ్డం (శ్రీహరి) దర్శకుడు. రమ్య కిలారి, జయచంద్రనాయుడు నిర్మాతలు. షూటింగ్ చివరి దశకు చేరుకున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానున్నది. సోమవారం త్రిగుణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి మోషన్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఇందులోని విజువల్స్, సౌండింగ్, హీరో లుక్ కొత్తగా ఉన్నాయి. త్రిగుణ్ రస్టిక్ లుక్‌లో కనిపిస్తున్నారు. వైవిధ్యమైన కథ, కథనాలతో ఈ చిత్రం రూపొందుతున్నదని మేకర్స్ చెబుతున్నారు. శ్రావణ్, మధునందన్, గగన్ విహారి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: వెంకట్ సి.దిలీప్, సంగీతం: కృష్ణ సౌరభ్.

# నా కెరీర్‌లోనే రామాయణ ప్రత్యేకం



ప్రస్తుతం దేశంలో రూపొందుతున్న భారీ చిత్రాల్లో అత్యంత భారీ సినిమా ఏది? అనంటే ఠక్కుమని వచ్చే సమాధానం 'రామాయణ'. నితేశ్ తివారీ దర్శకత్వంలో ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్ పతాకంపై దాదాపు మూడువేల కోట్ల భారీ నిర్మాణ వ్యయంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీరాముడిగా రణబీర్‌కపూర్, సీతగా సాయిపల్లవి నటిస్తున్న విషయం తెలిసిందే. రావణ పాత్రలో కన్నడ స్టార్ యశ్ నటిస్తుండగా, రావణుడి భార్య మండోదరి పాత్రను కాజల్ అగర్వాల్ పోషిస్తున్నట్టు ఇన్నాళ్లూ వార్తలొచ్చాయి.తాజాగా ఈ విషయాన్ని కాజల్ కూడా ధృవీకరించింది. ఓ అవార్డు వేడుకకు హాజరైన కాజల్ 'రామాయణ' గురించి మాట్లాడుతూ "రామాయణ'లో మండోదరిగా నటిస్తున్నాను. నా కెరీర్లో ఇలాంటి బిగ్ ప్రాజెక్ట్ చేయడం ఇదే ప్రథమం. అందరిలాగే ఈ సినిమా కోసం నేనూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నా' అన్నారు కాజల్. రెండు భాగాలుగా ఈ సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. తొలిభాగం ఈ ఏడాది దీపావళికి విడుదల కానుండగా, రెండో భాగాన్ని వచ్చే ఏడాది దీపావళికి విడుదల చేయనున్నారు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com